

జగన్ జమానా.. అరాచకాల అడ్డా

- డిప్యూటీ సీఎం, మేయర్, ఆర్టీసీ చైర్మన్ అనుచరుల ఆగడాలు
- కబ్జాలు, సెటిల్‌మెంట్లు, మర్డర్లు
- గంజాయి, మట్కా రౌడీ గ్యాంగ్‌లకు కేరాఫ్ కడప



కడప గడపలో జగన్ పుణ్యమా అని మళ్లీ పాతరోజులు పునరావృతం అయ్యాయి. ఒకప్పుడు కడప ఫ్యాక్షన్, రౌడీలకు అడ్డాగా ఉండేది. చంద్రబాబు నాయుడు సీఎం అయిన తర్వాత ఫ్యాక్షన్‌పై ఉక్కుపాదం మోపారు. రౌడీయిజాన్ని కూకటి వేళ్లతో పెకలించేశారు. శాంతి భద్రతల విషయంలో రాజీపడకుండా ఉండేవారు. కడప ఎస్పీగా ఉమేష్‌చంద్ర పనిచేసే కాలంలో కరుడుగట్టిన వ్యక్తుల అంతుచూశారు, జిల్లా బహిష్కరణ చేశారు. రౌడీలుగా చెలామణి అయ్యేవారు అంతా గప్‌చుప్ అయ్యారు. ఇదంతా 1999 కాలం నాటిది. మళ్లీ దాదాపు 20 ఏళ్ల తర్వాత జగన్ జమానాలో రౌడీల సంస్కృతి వచ్చింది. నాయకులే గ్యాంగులను ప్రోత్సహిస్తూ రావడం, మట్కా, జూదం, గంజాయి, సెటిల్‌మెంట్లకు అండగా ఉండడంతో జిల్లా కేంద్రమైన కడపలో ఈ ఐదేళ్లలో అరాచకం చోటుచేసుకుంది.



సీఎం జగన్‌తో శ్రీనివాసరెడ్డి



సెటిల్‌మెంట్ లావాదేవీల్లో వచ్చిన తేడాలతో హత్యకు గురైన శ్రీనివాసరెడ్డి

కడప, మే 10 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల క్రితం వరకు కడప నగరం చాలా ప్రశాంతంగా ఉండేది. జగన్ సీఎం కావడంతో కడప అటు అభివృద్ధిలో దూసుకుపోయి న్యూ సిటీగా మారుతుందని అందరు భావించారు. అభివృద్ధి మాట దేవుడెరుగు, న్యూసిటీ పక్కన పెట్టండి మళ్లీ పాతరోజులు కనిపించాయి. 1980-90ల నాటి కథలతో సినిమాలు తీస్తుంటే.. జగన్ పాలన కూడా డైరెక్ట్‌గా నాటి రోజులకు గుర్తుకు తెచ్చేలా రౌడీయిజం, దందాలే జరుగుతుండడం జనం బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కడప నగరాన్ని డిప్యూటీ సీఎం అంజాద్ బాష, మేయర్ సురేష్‌బాబు, కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి, ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జునరెడ్డిలు శాసిస్తున్నారు. అయితే నగరంలో జరిగే భూకబ్జాలు, మర్డర్లు, గంజాయి, జూదాలు, దందాలు, రౌడీగ్యాంగుల ప్రస్తావన వచ్చినప్పుడల్లా అన్ని వేళ్ల ఆ నలుగురివైపే చూపిస్తున్నాయి. వారి అనుచరులే కడప సిటీని అశాంతిని సృష్టించడం, నాగరికత ఉన్న రోజుల్లో కూడా ప్రజలు భయపడిపోతున్నారు. శాంతిభద్రతలను కాపాడాల్సిన పోలీసులు కొందరు ఆ నలుగురికి తొత్తులుగా మారడంతో కడప నగరం కబ్జాలు, సెటిల్‌మెంట్లు, దందాలు, గంజాయి మూడు పువ్వులు, ఆరు కాయలుగా డెవలప్ అయిందనే చర్చ నడుస్తోంది. జగన్ జమానాలో అసాంఘిక కార్యక్రమాలను పెంచి పోషిస్తున్నారు.

కడప జిల్లా హెడ్ క్వార్టర్. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కనుమరుగై సింగిల్ ఫ్యామి లీలు రావడం, జనం అభిరుచులు మారిపోవడంతో సొంతింటి కల నెరవేర్చుకుంటున్నారు. దీంతో పాటు కార్పొరేట్ సంస్థలు కడపలో బ్రాంచిలను ఏర్పాటు చేశాయి. దీంతో ఇక్కడ నివాస, వాణిజ్య స్థలాలకు మంచి డిమాండ్ వచ్చింది. స్థలాల ధరలకు రెక్కలొచ్చాయి. దీన్ని వైసీపీ నేతలు బాగా ఉపయోగించుకున్నారు. కడప నగరం చుట్టూ విలువైన స్థలాలన్నీ కబ్జా చేశారు. అయితే అన్ని వేళ్ల ఆ నలుగురి వైపే. కబ్జా ఏ స్థాయికి వెళ్లిందంటే కడపకు చెందిన మెట్టా సుబ్బరాయుడు 1980లో చిన్నచౌక్‌లోని రిమ్స్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని పట్టా భూమి లో వెంచర్ వేశారు. ఇది రిజిస్టర్ భూమి. సోమశిల ముంపువాసులు వచ్చిన డబ్బుతో అక్కడ ప్లాట్లను కొనుగోలు చేశారు. కడప విస్తరిస్తుండడంతో అక్కడ మౌలిక వసతులు లేకపోవడం, ఇతరత్రా కారణాలతో కొన్నవారు ఇళ్లు కట్టుకోలేదు. అయితే దానిపై మేయర్ సురేష్‌బాబు అనుచరులు కన్నేసి ఆక్రమించేందుకు ప్రయత్నించగా కొనుగోలుదారులు రారా తేల్చు కుందాం.. సై అంటే సై అనేకాడికి పోవడంతో ఆ మాజీ కార్పొరేటర్ గ్యాంగ్ తోకముడుచుకొని వెళ్లిపోయింది. రాజంపేట బైపాస్‌రోడ్డులో చిన్నచౌక్‌కు చెందిన భారతమ్మ అనే మహిళ మృతి చెందింది. అయితే ఆమె జీపీఏ డాక్యుమెంట్‌ను అడ్డుపెట్టుకొని, రాజంపేట బైపాస్, ఇర్కాన్ సర్కిల్‌లో ఉన్న విలువైన భూములన్నీ వివాదం సృష్టించారు. ఓ షోరూం ఎదురుగా ఉన్న భూమిలోకి ఓ కార్పొరేటర్ భర్త ఎంటరై ఇది మాదంటూ నకిలీ పట్టాతో హంగామా సృష్టించి చివరకు సెటిల్‌చేసుకున్నట్లు చెబుతారు. ఇక ఓ మున్సిపల్ ఉద్యోగి భూమిని కూడా కబ్జా చేశారు. అలాగే సాయిపేటలో ఆలిండియా రేడియో క్వార్టర్స్‌కు సంబంధించిన స్థలాన్ని కూడా కబ్జా చేశారు. అయితే ఈ కబ్జాల్లో మేయర్ సురేష్‌బాబు, డిప్యూటీ సీఎం అంజాద్ బాష తమ్ముడు అనుచరులు అనే ఆరోపణలు, విమర్శలు వచ్చాయి.

సెటిల్‌మెంట్లు

జగన్ సీఎం అయిన తర్వాత అభివృద్ధి లేకపోవడంతో వైసీపీ నేతలు భూ కబ్జాలు, సెటిల్ మెంట్లు నమ్ముకున్నారు. అందుకే కడప నగరాన్ని ఆ నలుగురు అసాంఘిక శక్తులు పెంచి పోషిస్తున్నారనే విమర్శ ఉంది. గతంలో ఎప్పుడు లేని విధంగా ఆ నలుగురు అనుచరులు 50గ్యాంగులను ఏర్పాటు చేశారంటారు. బెదిరింపులకు ఒక రేటు, కొట్టేందుకు ఒక రేటు, కాలు, చేయి తీస్తే ఒక రేటు, మర్డర్‌కు ఒక రేటు అనే విధంగా గ్యాంగులకు ఇచ్చారని ప్రచారం ఉంది. ఒక్కో గ్యాంగులో 20 నుంచి 30 మంది యువకులు ఉంటారు. గంజాయి మత్తులో ఉంటే వారికి పని చెబితే వెంటనే దిగేసి సెటిల్ చేస్తారు. ఇందులో భాగంగా రిమ్స్ సమీపంలోని పోలీస్ స్టేషన్ పక్కన రూ.20కోట్లు విలువ చేసే ఓ స్థలంలో ఆ ఓనరు ప్రహరీగోడ చిన్న రూము వేసుకొని ఉన్నారు. అయితే దానిపై కన్నేసిన ఓ నేత అక్కడుండే ప్రహరీగోడ, రూమును పగలగొట్టేస్తే.. పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న స్థలంలోకి ఎక్స్‌కవేటర్‌తో శ్రీనివాసరెడ్డి గ్యాంగ్ ధ్వంసం చేసిందంటారు. ఇంత తతంగం జరుగుతున్నా కూడా పోలీసులు పట్టించుకోకపోవడం గమనార్హం.



లావాదేవీల్లో తేడా రావడంతో...

కడపలో మొత్తం 50 డివిజన్లు ఉన్నాయి. ఆ నలు గురు భూములపై కన్నేస్తే ఈ గ్యాం గులు బాధితులను బెదిరించేసి దాడి చేసి సెటిల్ చేస్తారు. ఇలా వచ్చిన సొమ్ము ను గ్యాంగ్‌స్టర్స్ కలిసి పంచుకునే వారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి, డిప్యూటీ సీఎం అంజాద్‌బాష, ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి అనుచరుడు శ్రీనివాసరెడ్డిని తోటి గ్యాం గే 2023 జూన్ 23న సంధ్య సర్కిల్‌లోని ఓ ఫిట్‌నెస్ సెంటర్ వద్ద బుర్ఖాలు ధరించి మర్డర్ చేశారు. ఇది అప్పట్లో సంచలనం సృష్టించింది. కేవలం సెటిల్‌మెంట్ లో వచ్చిన డబ్బుల పంపకాల్లో మనస్పర్థలతోనే ఈ మర్డర్ జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి.

డబ్బులకు పోలీసుల దాసోహం

ఎవరికైనా అన్యాయం జరిగితే పోలీసులను ఆశ్రయిస్తారు. అయితే పోలీసులే బాధితుల పక్కన ఉండకుండా వైసీపీ పక్షాన నిలబడడం గతంలో ఎప్పుడు లేదు. చిన్నచౌక్‌లో పోలీస్‌స్టేషన్ సమీపంలోని ప్రహరీగోడను, రూమును ధ్వంసం చేసిన పోలీసులు పట్టించు కోకపోవడంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. పక్కనే ఇంత జరుగుతున్న కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తారంటారు. ఇక చిన్నచౌక్‌లో జరిగిన ప్రతి భూకబ్జా, సెటిల్‌మెంట్‌లో కడపను శాసించిన ఓ సీఐ ఉన్నారు. ఆయన వైసీపీ నేతలకు, బాధితులకు జంక్షన్ బాక్సులా వ్యవహ రించి వైసీపీకే మేలు చేశారంటారు. చిన్నచౌక్ పరిధిలో ఏదైనా ఖాళీ స్థలం ఉంటే చాలు అక్కడ భూ భకాసురులు ఎంటరవుతారు. చివరకు ఆ పంచాయతీ స్టేషన్‌కు వెళితే వాళ్లు పెద్దోళ్లు, వారితో మీరు పోరాడలేరు సెటిల్‌చేసుకోండి అంటూ ఈయన బెదిరించారంటారు. దాదాపు వందకోట్ల విలువైన ఆస్తులను ఆ సీఐ సెటిల్ చేశారం టారు. కడప రూరల్ సీఐగా వచ్చిన తర్వాత సీకెదిన్నె పరిధిలోని భూములను ఓ కార్పొరేటర్ కబ్జా చేస్తే బాధితులు స్టేషన్‌కు వస్తే వాళ్లనే ఆ సీఐ బెదిరించారంటారు. ఓ కార్పొరేటర్‌తో కలిసి సీకెదిన్నె పరిధిలో రియల్‌ఎస్టేట్ చేశారని చెబుతారు. విలువైన స్థలాలపై ఎవరైనా అభ్యంతరం చెబితే ఈ సీఐ సెటిల్‌మెంట్‌చేశారని చెబుతారు.



హత్యకు గురైన పశుసంవర్ధకశాఖ డీడీ అచ్చన్న (ఫైల్)



కడప సాయిబాబా హాల్ పక్కన ఉన్న బార్‌లో హత్యకు గురైన యువకులు (ఫైల్)

మర్డర్లే మర్డర్లు

కడప ఒకప్పుడు పీస్‌ఫుల్ సిటీ. అయితే జగన్ పాలనలో హత్య నగరంగా మారింది. సెటిల్‌మెంట్లు చేసే శ్రీనివాసరెడ్డిని, కక్షల కారణంగా సాయిబాబా థియేటర్ సమీపంలోని రఘురామ్ బార్‌లో 2023 ఫిబ్రవరి 21న కడపకు చెందిన రేవంత్, అభిలాష్‌లను ప్రత్యర్థులు దారుణంగా కత్తులతో పొడిచారు. ఈ ఘటన కలకలం రేపింది. అయితే శ్రీనివాసరెడ్డి హత్య కేసులో అభియోగాలు, రేవంత్, అభిలాష్‌ల మర్డర్‌లో అభియోగాలు ఎదుర్కొన్న వారంతా వైసీపీలో ఉండడం గమనార్హం. కడపలో రౌడీషీటర్లు వైసీపీలో ఉంటున్నారు. ఇక మట్కా విచ్చలవిడిగా సాగుతోంది. అయితే ట్రబుల్ మాంగ్లర్లు, గ్యాంగ్‌స్టర్లు, అంసాంఘిక శక్తులను డిప్యూటీ సీఎం సోదరుడు కాపాడుతున్నాడనే ఆరోపణ తీవ్రంగా ఉంది. కడపను అశాంతి చేసిన వారంతా ఆ నలుగురి అనుచరులు కావడమే విశే షం. ఈ గ్యాంగులు వాళ్లకు కావాల్సిన స్థలాన్ని ఖాజేసేందుకు ఎంతవరకైనా వెళ్తుండడం కలవర పాటుకు గురిచేస్తోంది. నగర శివారులోని ఓ కాలేజీలో దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఇక జీతం రాకుండా చేశారనే కసితో కడపకు చెందిన పశువైద్యశాల డీడీ అచ్చన్నను గత యేడాది మార్చి 23న అత్యంత దారుణంగా మర్డర్ చేశా రు. ఇవన్నీ కేవలం కొన్ని ఘటనలు మాత్రమే. వైసీపీ మళ్లీ వస్తే మా పరిస్థితేంటనే భయం జనాల్లో ఉంది.



మైలవరంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల

స్టీల్ ప్లాంట్ కోసం.. రెండుసార్లు భూమి పూజ

- రెండు ఇటుకలు కూడా వేయని సీఎం
- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల

మైలవరం/చాపాడు/ఖాజీపేట, మే 10: కడప స్టీల్‌ప్లాంట్ కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో రెండుసార్లు భూమిపూజ చేసి రెండు టెంకాయలు కొట్టడం తప్ప రెండు ఇటుకలు కూడా అక్కడ వేయలేదని పీసీసీ అధ్యక్షురాలు, కడప కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల రెడ్డి అన్నారు. శుక్రవారం మైలవరం, చాపాడు, ఖాజీపేట మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అవినాష్ రెడ్డి పార్లమెంట్‌లో కూడా ఏనాడు స్టీల్ ప్లాంట్ కోసం పోరాటం చేయలేదు కానీ.. సీబీఐ కేసుల నుంచి కాపాడుకోవడం కోసం ఢిల్లీకి వెళ్లి రావడం తప్ప చేసిందేమీ లేదన్నారు. కొంగుచాచి అడుగుతున్నా న్యాయం చేయండి... మీకు ఎంపీగా రాజశేఖర్‌రెడ్డి బిడ్డ కావాలో.. వివేకానందరెడ్డిని హత్య చేయించిన అవినాష్‌రెడ్డి కావాలో తేల్చేకోవాలని అన్నారు. ఒక వైపు న్యాయం, ధర్మంతో రాజశేఖర్‌రెడ్డి బిడ్డ నిలబడింది. మరో వైపు నేరం, డబ్బు అధికారం నిలబడిందన్నారు. నన్ను ఎంపీగా గెలిపిస్తే రాజశేఖర్‌రెడ్డి మీకు సేవ చేసినట్లు, వివేకానందరెడ్డి మీకు అందుబాటులో ఉన్నట్లు నేను కూడా సేవ చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జమ్మలమడుగు, మైదుకూరు కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థులు బ్రహ్మానందరెడ్డి, శ్రీరాములు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నేడు కడపకు రాహుల్ గాంధీ రాక

- ముమ్మరంగా ఏర్పాట్లు
- ఎన్నికల ప్రచారానికి నేటితో తెర



కడప బిల్టప్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన సభావేదిక

(కడప-ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల సమరం కీలకదశకు చేరుకుంది. ఎన్నికల ప్రచారం శనివారం సాయంత్రం 5 గంటలకు ముగియనుంది. దాదాపు 45 రోజుల పైగా సాగిన ఎన్నికల ప్రచారానికి ముగింపు పడనుంది. ఊరువాడా పలికిన మైకులు మూగబోనున్నాయి. ఇక చివరి రోజు ప్రచారానికి కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ రానున్నారు. శనివారం 11-30 గంటలకు రాహుల్ గాంధీ కడప విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలతో కలసి హెలికాప్టర్ ద్వారా ఇడుపులపాయ చేరుకుంటారు. అక్కడ వైఎస్సార్ ఘాట్ చేరుకుని వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమాధికి నివాళులు అర్పిస్తారు. తిరిగి కడప చేరుకుని బిల్టప్ సర్కిల్ వద్దగల పుత్తా ఎస్టేట్‌లో జరిగే బహిరంగ సభలో మధ్యాహ్నం 1 నుంచి 2గంటల వరకు పాల్గొంటారు. ఈ మేరకు కాంగ్రెస్ శ్రేణులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. రాహుల్ సభకు పెద్దఎత్తున కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి పిలుపునిచ్చారు.



సభా వేదిక వద్ద ఫ్లెక్సీలు

నిర్భయంగా ఓటేయండి

- పోలింగ్‌కు సర్వం సిద్ధం
- నేటి సాయంత్రం 6 గంటల నుంచి సైలెంట్ పీరియడ్
- ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు

కడప(కలెక్టరేట్), మే 10: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు సర్వం సిద్ధం చేశామని, ఓటర్లు నిర్భయంగా తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్లో ఈనెల 13న కడప పార్లమెంట్, 7 అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలిం గ్ ప్రక్రియ ఏర్పాట్లపై పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు ప్రణాళికాబద్ధంగా చేపట్టామన్నారు. గత నాలుగు రోజులుగా ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, సిబ్బంది 96.44 శాతం పోస్టల్ బ్యాలెట్ ఓటును సద్వినియోగం చేసుకున్నారని తెలిపారు. జిల్లాలో ఒంటిమిట్ట, సిద్దవటం మండలాలతో కలిపి 2035 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని.. ఎన్నికల విధుల్లో 20,537 మంది పీవో, ఏపీవో, ఓపీవో సిబ్బంది విధులు నిర్వహించనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించామన్నారు. ఈ ఎన్నికల్లో మొత్తం 124 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని.. అందులో కడప పార్లమెంట్ స్థానానికి 14 మంది, మిగతా 7 నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థులుగా 110 మంది పోటీ చేస్తున్నారని తెలిపారు. 13వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 6గంటల వరకు 16,39,066 మంది తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోనున్నారని వివరించారు.

జిల్లాలో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు ప్రత్యేక పోలీసు, పారామిలటరీ బలగాలు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో కొత్తగా ఓటరు గుర్తింపు కార్డులు 3,09,282 వచ్చాయని పోస్టల్‌శాఖ ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. పోలింగ్ సమయంలో అల్లర్లకు పాల్పడడం, ఉసిగొల్పే వారు, ఎన్నికల ప్రశాంతతకు భంగం కల్గించే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఎన్నికల విధులకు కేటాయించిన సిబ్బందికి 11వ తేదీ ర్యాండమైజేషన్ నిర్వహించి, పోలింగ్ కేంద్రాలను కేటాయిస్తామన్నారు. 12న సాయంత్రంలోగా కేటాయించిన పోలింగ్ కేంద్రాల్లో ఉండాలన్నారు. 13న ఉదయం 5-30 గంటలకు మాక్‌పోలింగ్ నిర్వహించి, 7 గంటల నుంచి పోలింగ్ ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు సాగుతుందన్నారు. 6 గంటల్లోగా క్యూలైన్లో ఉన్న ఓటర్లకు ఓటు హక్కు కల్పిస్తామన్నారు. పోలింగ్ స్టేషన్‌కు 100 మీటర్ల వరకు ఓటర్లు తప్ప ఎవ్వరూ ఉండరాదన్నారు. కాగా, ఓటింగ్ రోజుకు 48 గంటల ముందు శనివారం సాయంత్రం 6గంటల నుంచి సైలెన్స్ పీరియడ్ ప్రారంభమవుతుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సైలెంట్ పీరియడ్ నుంచి పోలీసు ఆంక్షలు కఠిన తరంగా ఉంటాయని రాజకీయ పార్టీ నేతలకు వివరించారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

పోలింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్టమైన ప్రత్యేక పోలీసు బందో బస్తుతో పాటు, పారా మిలటరీ బలగాలు విధులు నిర్వహించనున్నారని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ వెల్లడించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక భద్రతా సిబ్బంది, సెక్టారు అధికారులతో నిఘా పెట్టడం జరిగిందన్నారు. పోలింగ్‌లో 3000 మంది పోలీసులు, 900 మంది ఆర్మ్‌డ్ ఫోర్సుతో పాటు ఎన్‌సీసీ, స్కౌట్‌కు సంబంధించి 5వేల మంది వరకు ఎన్నికల విధుల్లో పాల్గొంటారన్నారు. పోలింగ్ ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు. ఎవ్వరైనా ఈవీఎంల జోలికెళ్లినా, ఎన్నికలో అల్లర్లకు, అత్యుత్సాహం చూపే వారిపై కేసులు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల ప్రత్యేక అధికారి ప్రవీణ్ చంద్, అసిస్టెంట్ కలెక్టర్ మౌర్యభరద్వాజ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

జగన్ సభ తుస్..

- రోడ్ షోలో జనం లేక వెలవెల
- సభ మధ్యలోనే జనాలు జంప్

కడప, మే 10 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ప్రజలు ముఖం చాటేశారు. ఎంతో ఆర్భాటంగా జరుగుతుందనుకున్న సీఎం జగన్ సభ తుస్ మనిపించింది. కనీసం రోడ్‌షోలో కూడా జనం లేక వైసీపీ శ్రేణులకు నిరాశ కలిగించింది. శుక్రవారం కడప నగరం గోకుల్ సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి మాట్లాడు తుండగానే సభ మధ్యలో ప్రజలు వెనుదిరిగారు. ఈ సభకు వైసీపీ శ్రేణులు అనుకు న్నంతగా ప్రజలు హాజరుకాలేదు. ఒక్కో వ్యక్తికి రూ.200 ఇచ్చినప్పటికీ వారు వచ్చారు, వెళ్లారు అన్నట్లుగా జరిగింది. ముఖ్యమంత్రి మాట్లాడుతూ కడప జిల్లా ప్రజలు కన్న తల్లిలా తనను ఆదరించారన్నారు. వైఎస్ మరణానంతరం ఆయన పేరును సమాధి చేయాలన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని.. తనను కూడా 16నెలలు జైల్లో పెట్టారన్నారు. అటువంటి పార్టీని రాష్ట్ర ప్రజలు ఏనాడో సమాధి కట్టారన్నారు. అయితే ఇపుడు ఎన్డీయే అభ్యర్థులను గెలిపించేందుకు కాంగ్రెస్ పార్టీ మళ్లీ రాష్ట్రంలోకి అడుగుపెట్టిందని చెప్పారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మన కన్ను మనం పొడుచుకున్నట్లే అన్నారు. ముస్లిం మైనార్టీలకు నాలుగుశాతం రిజర్వేషన్ కొనసాగించాల్సిందేనన్నారు. అలాగే ఎన్ఆర్‌సీ, సీఏఏలోను మైనార్టీలకు వైసీపీ అండగా ఉంటుందన్నారు. సీట్ల సర్దుబాటులోను ముస్లిం మైనార్టీలకు నాలుగుశాతం రిజర్వేషన్ కల్పిస్తూ ఏడు సీట్లు ఇచ్చినట్లు తెలిపారు.



జనాల్లేకుండా రోడ్‌షో...

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బహిరంగ సభ అనంతరం రోడ్‌షో నిర్వహించారు. ఈ రోడ్‌షోలో జనాల్లేక పోవడంతో వెలవెలబోయింది. ఇది వైసీపీ నాయకులకు తీవ్ర నిరాశ కలిగించింది. అయితే మరి కొన్నిగంటల్లో ఎన్నికలు ఉండడంతో వైసీపీ శ్రేణులు ముఖ్యమంత్రి రోడ్‌షో తమకు లాభం చేకూరుస్తుందనే ఆశించారు. అయితే ఎటువంటి జోష్ లేకుండా జగన్ పర్యటన చప్పగా సాగడం పట్ల పార్టీ శ్రేణులు నిట్టూరుస్తున్నారు.

సభ మధ్యలోనే జనం జంప్

ముఖ్యమంత్రి జగన్ సభ జరుగుతుండగానే ప్రజలు వెనుదిరిగారు. వారిని నిలువ రించేందుకు వైసీపీ శ్రేణులు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికి అది ఫలించలేదు. ప్రధా నంగా మహిళలు అధిక సంఖ్యలో వెనుదిరిగారు.

బారికేడ్లతో ఇబ్బందులు

సీఎం జగన్ రోడ్‌షోకు సంబంధించి పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. నగరంలో పాత మున్సిపల్ కార్యాలయం, కృష్ణా సర్కిల్, దేవునికడప ఆర్చి వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోక తప్పలేదు. కొంతమంది ముఖ్యమంత్రిపై సనుక్కున్నారు కూడా. సీఎం వచ్చిన ప్రతిసారి నగర ప్రజలకు ఈ తిప్పలు ఏంటని మరికొందరు వాపోయారు. అయితే జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన ఛీత్కారాలు, శాపనార్థాల మధ్య కొనసాగిందని చెప్పాలి.



జగన్ ప్రసంగిస్తుండగా వెనుదిరిగిన ప్రజలు

మీ ఓటుతో కడప చరిత్ర మారుస్తా

- కడప అభివృద్ధే టీడీపీ ప్రధాన కర్తవ్యం
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి
- ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), మే 10 : మీ ఓటుతో కడప చరిత్ర తిరగరాస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కడప అభివృద్ధే టీడీపీ ప్రధాన కర్తవ్యమని స్పష్టం చేశారు. శుక్రవారం కడప నగరం అప్సర సర్కిల్‌లో భారీ బహిరంగ, రోడ్‌షో నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ఇసుక మట్టి భూకబ్జాలు చేసేందుకు ఇక్కడ ఎమ్మెల్యే తన తమ్ముడు ప్రజలను బెదిరిస్తూ దోచుకుంటున్నారన్నారు.చంద్రబాబు సీఎంగా ఉన్న సమయంలో కంబాలదిన్నెలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు భూమిపూజ చేస్తే అధికారంలోకి వచ్చిన జగన్ అదే పరిశ్రమకు రెండుసార్లు భూమి పూజ చేసి పనులు మాత్రం చేయలేదని ఆరోపించారు. అలాగే షుగరుఫ్యాక్టరీ, పాలశీతలీకరణ*పరిశ్రమ, నందలూరు ఆల్విన్ పరిశ్రమ తెప్పిస్తామని చెప్పి మాట తప్పారన్నారు. పాత కడప చెరువును ట్యాంక్‌బండ్ చేస్తామని చెప్పి ఇంత వరకు అతీ గతీ లేదన్నారు. పెట్టుబడులు రావాలన్నా పరిశ్రమలు నెలకోల్పాలన్నా అది చంద్రబాబుకే సాధ్యమన్నారు. కడప నగరంలో వైసీసీ ప్రజా ప్రతినిధులు వారి కుటుంబసభ్యులకు అరాచకాలకు అడ్డు అదుపు లేకండాపోయిందన్నారు. భూకబ్జాలు, బెదిరింపులు, హత్యలు లీగల్ చేశారని అన్నారు .మహిళలకు కనీస గౌరవంకూడా ఇవ్వని పరిస్థితి నెలకొందన్నారు. వెంచర్ల ముసుగులో ప్రభుత్వ భూములు సైతం వదలడలేదన్నారు. కడప నగరంలో దాదాపు 400 వరకు అనధికార లేఅవుట్ అధికారులు గుర్తించారంటే ఏ విధంగా భ ఊ ఆక్రమణలకు పాల్పడుతున్నారో అర్ధమవుతుందన్నారు. సీకేదిన్నె, మూలవంక మీపంలో 52 ఎకరాల ప్రభుత్వ స్థలంలో వెంచర్లు వేసి విక్రయించారనితెలిపారు. బుగ్గవంకపై షహమీరియా దర్గా వద్ద రవీంద్రనగర్ లా కాలేజీకి వెళ్లే దారిలో గతంలో ఉన్న రెండు బ్రిడ్జిలు తొలగించారని, దీంతో ఎంతోమంది ఇబ్బంఉలు పడుతున్నారన్నారు. డీపీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే వీటిపై బ్రిడ్జిలు నిర్మిస్తామన్నారు. పాలెంపల్లె, వైఎస్ఆర్ నగర్, ఆచారికాలనీ, హోమియోపతి కళాశాల రోడ్డు, గాంధీనగర్ స్కూలు నుంచి ప్రకాశ్‌నగర్ వెళ్లే రోడ్లతో పాటు నగరంలోని ప్రతిరోడ్డు అధ్వానంగా ఉందన్నారు. వైసీపీ ప్రతినిధులకు ఇవి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. రిమ్స్ నుంచి సబ్‌జైలు కూడలికిరావాలంటే సరైన మార్గం లేదన్నారు. ప్రజలకు కనీసం బస్సు సౌకర్యం కూడా లేదన్నారు. కడపనగరమంటే ఒక బ్రాండ్ అని, ఆ బ్రాండ్ నేమ్‌ను దెబ్బతీస్తూ పదేళ్లుగా ఎమ్మెల్యే మాఫియా నడిపిస్తున్నారన్నారు. యువతను ఉద్యోగాల ఊసే ఎత్తకుడా మత్తులో దించుతున్నారన్నారు. దర్గా భూములు, వక్ఫ్‌భూములు దొంగలపాలు అవుఉంటే దాన్ని అడ్డుకోలేదన్నారు. పేదరికంలో మగ్గుతున్న ముస్లిం కుటుంబాలకు ఎలాంటి సహాయం లేదన్నారు. ముస్లింల మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఎలాంటి తోడ్పాటు కల్పించలేదన్నారు. వరుసగా రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించి ప్రజలు మోసపోయారన్నారు. ఈసారి అయినా ప్రత్యామ్నాయంగా ఉండాలన్నారు. రానున్న ఎన్నికల్లో డీపీపీ భ్యర్థిని గెలిపిస్తే ప్రజలకు అందుబాఉటలో ఉంటూ కడప నగరాన్ని చరిత్రలో నిలిచిపోయేలా అభివృద్ధి చేసి చూపిస్తామని స్పష్టం చేశారు. అలాగే కడప కార్పొరేషన్ పరిధిలో ప్రతి డివిజనులో మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా దర్బారు ఏర్పాటు చేసి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తానన్నారు. కడప ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు సుంఠర శ్రీనివాస్, తుంగా రమణయ్య,టీడీపీ నాయకులు శివకొండారెడ్డి, రవి, రాజగోపాల్‌రెడ్డి, ట్రాన్స్‌ఫార్మరు శ్రీను, ప్రసాద్, మల్లి, సురేష్‌తోపాటు బీజేపీ, జనసేప, టీడీపీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.




కడప నగరంలో నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి... మాట్లాడుతున్న కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి

కష్టపడే ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం

టీడీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు కష్టపడిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి, కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డి అన్నారు. శుక్రవారం ద్వారకానగర్ మాధవీరెడ్డి కార్యాలయంలో డివిజన్, బూత్ ఇన్‌చార్జ్‌లు, ఏజెంట్లు, కన్వీనర్లు, క్లస్టరు సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారంటీ సమర్థవంతంగా నిర్వహించి 55వేల నివాసాల్లో ప్రజలను కలిసి ఓట్లు అభ్యర్థించినట్లు తెలిపారు. స్థానికులం మేమైతే సిద్దవటం నుంచి వచ్చిన అంజద్‌బాషా, ఆయన తమ్ముడు మమ్మల్ని స్థానికులు కాదనడం హాస్యాస్పదమన్నారు. మహిళ అని కూడా చూడకుండా బూతులు తిట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. తండ్రి ఆశయాన్ని కొనసాగించాలన్నదే లక్ష్యమన్నారు. అంజద్‌బాషా మూడోసారి గెలిస్తే కడప నగరం ప్రమాదంగా మారుతుందని ప్రజలు గ్రహించాలన్నారు. 12న సాయంత్రానికి ఏజెంట్లు 282 బూత్‌లలో ఒక్కో బూత్‌లో నలుగురు చొప్పున కూర్చోవాలాన్నరు. దొంగ ఓట్లు పడకుండా జాగ్రత్తగా ఉండాలాన్నరు. సమావేశంలో టీడీపీ జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ కూటమి అభ్యర్థి మాధవిని గెలిపించండి

కడప నగరం అప్సరా సర్కిల్‌లో జనసేన నాయకులు తుంగా రమణయ్య, ఆర్ఎస్‌యు రాష్ట్ర అధ్యక్షలు రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో వందల మంది యువతతో ర్యాలీగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప ఎమ్మెల్యే అభ్యర్థి మాధవీరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలకు అభ్యర్థించారు. గత 25 ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోక అన్ని విధాలుగా కడప నగరం వెనుకబడి పోయిందని, కడప పరిసర ప్రాంతాలతో పాటు నగరం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్నమాధవీని గెలిపించాలన్నారు. అలాగే చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకానికి సంబంధించి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిఇంటికీ ఉచితంగా మూడు గ్యాస్‌సిలిండర్లు, మహిలలకు అమ్మఒడి కింద ఎంతో మంది పిల్లలుంటే అంత మందికి సవంవత్సరానికి 15వేల చొప్పున ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి మహిళ ఎక్కడికి వెళ్లినా బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే యువతకు నిరుద్యోగ భృతి రూ.3వేలు ఇవ్వడం జరుగుతుందన్నారు. విక లాగులకు రూ.6వేలు పింఛను, వృద్ధులకు రూ.4వేలు పింఛను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఎన్నికల కోకన్వీనరు రంజిత్, సాయి, గజ్జల మహేశ్, కిరణ్, కంచి లోకేశ్, బాబు, రాజా, రజాక్, కన్నా, ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, హరిబాబు పాల్గొన్నారు.




ప్రచారం నిర్వహిస్తున్న మాధవీరెడ్డి తనయుడు శ్రావణ్‌రాజ్‌రెడ్డి.. విక్టరీ చూపుతున్న మాధవీరెడ్డి



శ్రీనివాసరెడ్డి, మాధవీరెడ్డిలను గజమాలతో సత్కరిస్తున్న జనసేన నాయకుడు తుంగా రమణయ్య



ఈవీఎం నమూనాను చూపిస్తూ ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ కడప జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎద్దుల శంకర్

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యం

- రెడ్డప్పగారి శ్రావణ్‌రాజ్ రెడ్డి

చంద్రబాబుతోనే అభివృద్ధి సాధ్యమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎమ్మెల్యే అభ్యర్థి తనయుడు రెడ్డప్పగారి శ్రావణ్ రాజ్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కడప నగరం ఏడురోడ్ల మసీదు సమీపంలో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొని అనంతరం ఎన్నికల ప్రచారం చేశారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి మాధవీరెడ్డిని, ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డిని గెలిపించాలని ముస్లిం సోదరులను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జియావుద్దీన్. జహంగీర్, నిషార్, తాజు, ఇబ్రహీం, ఇమాన్, యూసఫ్, సొహైల్ పాల్గొన్నారు.

ల్యాండ్ టైటలింగ్ యాక్టు ప్రజలకు శాపం

వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటలింగ్ యాక్టు ప్రజల పాలిట శాపమని టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి మాధవి పేర్కొన్నారు. శుక్రవారం కడప నగరం ద్వారకనగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో ల్యాండ్ టైటలింగ్ చట్టం పత్రాలను వారితో పాటు రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి గోవర్ధనరెడ్డి బ్రాహ్మణ కార్పొరేషన్‌జిల్లా కన్వీనరు జనార్ధన్, జనసేన జిల్లా కన్వీనరు సుంకర శ్రీనివాస్, బీజేపీ నేత చలపతితో కలిసి ల్యాండ్ టైటలింగ్‌యాక్టు ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రజల ఆస్తులను స్వాధీనం చేసుకునేందుకు వైసీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఇప్పటికే ప్రజల ఆస్తులకు రక్షణ లేకుండా చేసినవైసీపీ ఇప్పుడు భూమిపై కూడా ప్రజలకు హక్కు లేకుండా చేస్తున్నారన్నారు.

రాక్షసున్ని చంపేందుకు దేవతలంతా ఏకమైనట్లు జగన్ పాలనను అంతం చేసేందుకు కూటమి ఏకమైందన్నారు. 13న తరవాత వైసీపీ తుడిచి పెట్టుకుపోవడం తథ్యమన్నారు. 20 ఏళ్ల తరువాత కడపకు మహిళా ఎమ్మెల్యే మాధవీరెడ్డి రానుందని అందుకోసం ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటు వేసి గెలిపించాలన్నారు. అనంతరం మాధవీరెడ్డి మాట్లాడుతూ చంద్రబాబునాయుడు సీఎం పదవిలోకి రాగానే ల్యాండ్ టైటలింగ్‌యాక్టు రద్దు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, బీజేపీ నేతలు చలపతి తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి: ఆర్వో



మాట్లాడుతున్న ఆర్‌ఓ వెంకటేశులు

పులివెందుల టౌన్,మే 10: పౌరులంతా సామాజిక బాధ్యతగా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆర్‌ఓ వెంకటేశులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ప్రతి ఒక్కరు ఓటు వేయాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని, ఓటింగ్ పెరగాలని, ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్‌లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుచేశామన్నారు. ప్రతి పోలింగ్ సెంటర్‌లో మౌళిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. మహిళలకు, పురుషులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటుచేశామని, గర్భిణిలు, దివ్యాంగులు ఉన్నట్లయితే వారికి అక్కడే ఉన్న ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వారు సహాయ సహకారాలు అందిస్తారన్నారు. నియోజవర్గంలో ఈవీఎంల పర్యవేక్షణకు గాను ముగ్గురు బెల్ ఇంజనీర్లు కూడా ఉంటారన్నారు. శనివారం సాయంత్రం 6గంటలకు ప్రచారాలు ముగించాలన్నారు. 11వ తేదీ నుంచి 13వ తేదీ రాత్రి వరకు ఎలాంటి మద్యం అమ్మకాలు జరగవన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు మూడు వాహనాలకు మించి వాడరాదని తెలిపారు. ఆ వాహనంలో కూడా ఐదుగురి కంటే ఎ క్కువ మంది ప్రయాణించరాదన్నారు. పోలింగ్ రోజు, అంత కంటే ముందురోజు మాత్రమే పత్రికా ప్రకటనలు ఇచ్చుకోవచ్చు అన్నారు. సర్టిఫికెట్లు తీసుకొని యాడ్స్ వేయించుకోవాలని తెలిపారు. పులివెందుల నియోజకవర్గంలో 301 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి, అందులో 2,29,687 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ప్రతి ఒక్కరు ఓటు వేసి పోలింగ్ శాతాన్ని పెంచాలన్నారు. పోలింగ్ సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇచ్చామన్నారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకొని వందశాతం ఓటింగ్ నమోదయ్యేలా చూడాలన్నారు. ఓటున్న ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ఎండను సైతం లెక్కచేయకుండా మందుబాబుల క్యూ



మధ్యాహ్న సమయంలో మద్యం దుకాణం వద్ద బారులు తీరిన మందుబాబులు

పులివెందుల టౌన్, మే 10: ప్రభుత్వ మద్యం దుకాణాల వద్ద ఎండనుసైతం లెక్కచేయకుండా మందుబాబులు క్యూ కడుతున్నారు. మద్యం దుకాణాల్లో సమయం కుదించడంతో మందుబాబులకు ఇబ్బందులలు తప్పడం లేదు. గతంలో పనులకు పోయి వచ్చిన తర్వాత ఎప్పుడైన మద్యం దొరికేది. కానీ ఇప్పుడు సమయం తగ్గించి లిమిట్ పెట్టడంతో ఎప్పుడు అయిపోతుందేమోనని మందుబాబులు షాపులు తీయకముందే క్యూలో నిలబడి ఉంటున్నారు. ఎన్నికల కోడ్‌తో సమయం కుదించడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని, మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సీజన్ అయిన రాజకీయ నాయకులు తగినంత సరఫరా చేయకపోవడంతో మందుబాబుల ఆశలు గల్లంతయ్యాయి. షాపుల్లో ఒక్కొక్కరికి ఒక్కో బాటిల్‌నే ఇస్తున్నారు. దీనితో పనులు మానుకొని క్యూలో ఉంటున్నామని మద్యం ప్రియులు వాపోతున్నారు. రాజకీయపార్టీ నాయకులు కూడా మద్యం అడిగిన వారికి డబ్బులు ఇచ్చి వెళ్లి తెచ్చుకోండని చెబుతున్నారే కానీ చాలా చోట్ల సరఫరా చేయలేకపోతున్నారు. పెద్దనాయకుల సభలకు మాత్రం సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలు త్వరగా మూసివేయడంతో బారుకు వెళితే క్వార్టర్ బాటిల్‌పై రూ.50 అదనంగా వసూలు చేస్తున్నట్లు వారు చెబుతున్నారు. ప్రైవేటు వ్యక్తులు రూ.100 వసూలు చేస్తున్నారని మందుబాబులు వాపోతున్నారు. బార్‌లో అదనంగా ఎంత పర్సెంటేజీ వసూలు చేయాలో, ఎంత వసూలు చేస్తున్నారో పరిశీలించే అధికారులు లేకపోవడంతో బార్‌లో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారని మందుబాబులు వాపోతున్నారు.

చంద్రబాబుతోనే పెన్షనర్ల జీవితాల్లో వెలుగులు

కడప (మారుతీనగర్), మే 10: చంద్రబాబుతోనే పెన్షనర్ల జీవితాల్లో వెలుగులు అని, మరో మారు తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ఆంధ్రా పెన్షనర్స్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.మునయ్య పేర్కొన్నారు. శుక్రవారం కడపలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పెన్షనర్లకు ఏ నెలలోనూ పెన్షన్ 1వ తేదీన రాలేదన్నారు. 15, లేదా 18 తేదీన ఇస్తున్నారని ఆవేవదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రాన్ని సుమారు రూ.12 లక్షల కోట్ల అప్పుల్లోకి నెట్టివేసి అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. కడప అసెంబ్లీ బరిలో తెలుగుదేశం పార్టీ మహిళా అభ్యర్థిగా పోటీ చేస్తున్న రెడ్డప్పగారి మాధవిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి సరికొత్త చరిత్రకు నాంది పలకాలని కోరారు.

బద్వేలు ఆర్టీసీ డిపో పరిశీలన

బద్వేలు, మే 10: బద్వేలు ఆర్టీసీ డిపో స్లాబు పెచ్చు లూడి ఓ మహిళపై పడి గాయాలైన ఘటన ఈ నెల 9వ తేదీన జరిగింది. దీనికి స్పందించిన రాయలసీమ ఎగిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వర రావు, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణ శుక్రవారం ఆర్టీసీ బస్టాండులో పరిశీలిం చారు. పెచ్చులూడిన బస్టాండు ను పరిశీలించి నెలలోపు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని డీఎం శ్రీనివాసరావుకు సూచించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు డిపో గ్యారేజీని ఆయన పరిశీలించారు.

పోలీసు కవాతు

ప్రొద్దుటూరు క్రైం, మే 10 : ఒకటో పోలీస్ స్టేషన్ పరిధిలో కేంద్ర సాయుధ బలగాలతో శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు. ముగ్గురు ఐపీఎస్ అధికారులతో పాటు వన్ టౌన్ సీఐ శ్రీకాంత్, ఎస్ఐ హైమావతి పోలీసు సిబ్బందితో కలిసి పర్యటించారు. రామేశ్వరం, మిట్టమడి వీధి, వరలక్ష్మి ఆపార్టుమెంట్స్, గురువయ్యతోట, ఆర్ట్సుకాలేజీరోడ్డు, గాంధీరోడ్డు, బీజీఆర్ వీధి, కేఎస్ఎం స్ట్రీట్‌లో కేంద్ర బలగాలతో, ఫ్లాగ్ మార్చ్ పాల్గొన్నారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యమన్నారు.

నేటితో ముగియనున్న ప్రచార పర్వం

వీరపునాయునిపల్లె, మే 10: నిన్నటి వరకు ప్రచారాలతో హోరెత్తించిన పార్టీల ప్రచార పర్వానికి నేటితో ఫుల్‌స్టాప్ పడనుంది. గత నెలన్నర నుంచి టీడీపీ, కాంగ్రెస్, వైసీపీల ఎమ్మెల్యే అభ్యర్థులు ఒకవైపు, ఆయా పార్టీ నాయకులు, కార్యకర్తలు మరోవైపు ఇలా గ్యాప్ లేకుండా ప్రచారాలు హోరెత్తించారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాలను ఇంటింటికి వెళ్లి వివరించారు. తమ అభ్యర్థికి ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ కరపత్రాలు, మైకుల అనౌన్స్‌మెంట్లు చేశారు. ఈనెల 13వ తేదీన పోలింగ్ జరగనుంది. 11వ తేదీ శనివారం సాయంత్రం 6గంటలకు ప్రచారం ముగియనుంది.

'చంద్రబాబు గెలుపే మాదిగల ధ్యేయం'



సంఘీభావం వ్యక్తం చేస్తున్న పేరుపోగు వెంకటేశ్వరరావు

కడప (మారుతీనగర్), మే 10: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడి గెలుపే మాదిగల గెలుపుగా భావించి ప్రతి ఒక్కరూ టీడీపీకి ఓటు వేయాలని 35 మాదిగ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం కడప ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తొలుత సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగన్‌రెడ్డి ఐదేళ్ల అరాచక పాలనలో దళితుల బతుకులు కడు దయనీయంగా మారాయన్నారు. నవరత్నాల పేరుతో ఎస్సీ, ఎస్టీ, సబ్‌ప్లాన్ నిధులను సైతం దళితులకు అందకుండా చేసిన దుర్మార్గుడు జగన్‌రెడ్డి అన్నారు. గతంలో ఎన్ఎస్ఎఫ్‌డీసీ పథకం ద్వారా నేరుగా అర్హులైన దళితులకు సెంట్రల్ నుంచి ఫండ్స్ వచ్చేవని, వాటితో ఏకంగా ఇన్నోవా కార్లు అందేవన్నారు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి కా గానే ఆ నిధులన్నీ నవరత్నాలకు మళ్లించి దళితులను దగా చేశారని నిప్పులు చెరిగారు. ఏది ఏమైనా జగన్‌రెడ్డి 5 సంవత్సరాల పాలనలో దళితులు 20 సంవత్సరాలు వెనకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కుంటుపడిన దళితుల సంక్షేమాన్ని తిరిగి గాడిలో ఉంచగల విజన్ గల నాయకుడు చంద్రబాబును మరో సారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

లింగాల, మే 10: మండలంలోని లింగాల, చిన్నకుడాల, గుణకనపల్లె సబ్‌స్టేషన్ల పరిదిలోని గ్రామాలలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ రమేష్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్‌స్టేషన్లలో మెయింటెనెన్స్ కారణంగా ఈ అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

టైటిల్ యాక్ట్... నల్లచట్టంతో సమానం



జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో టైటిల్ యాక్టు ప్రతులను దహనం చేస్తున్న భూపేష్‌రెడ్డి



కాంబల్లెలో ఎన్నికల ప్రచారంలో భాగంగా భూపేష్‌రెడ్డి పక్కన ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

- టీడీపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి

కడప, మే 10 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కుల చట్టం రైతు భూములను హరించే చట్టం. ఇది ఒకరకంగా నల్లచట్టమని టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి భూపేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో టీడీపీ నేతలు చదిపిరాల్ల గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో టైటిల్ యాక్ట్ ప్రతులను దగ్ధం చేశారు. అలాగే పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం కాంబల్లెలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ తీసుకొచ్చిన లల్యాండ్ టైటిల్ యాక్టుతో ఎవరి భూములకు భద్రత లేదఃన్నారు. మీ భూములు మీవి కావు. జగన్ వస్తే అవన్నీ వైసీపీ నేతల వశం అవుతాయి. ఇప్పటికే జగన్ అనుచరులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను కొల్లగొట్టారు. మళ్లీ జగన్ సీఎం అయితే మీ ఆస్తులను దోచేస్తారు. మీ భూమి, మీ స్థలాలు మీకు రావాలంటే జగన్ పార్టీని ఓడించండి. చంద్రబాబు సీఎం అయితే ఆ యాక్టును రద్దుచేస్తామంటూ హామీ ఇచ్చారు. ప్రైవేటు ఆస్తుల భద్రత కాదు జనం ఆస్తుల కోసం టీడీపీ భరోసాగా ఉంటటుంది. కేంద్రంలో మోడీ ప్రధాని అయి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే మన సమస్యలన్నీ తీరి స్టీల్ ఫ్యాక్టరీ వస్తుంది.

అభివృద్ధి చేస్తా ఆశీర్వదించండి.. జగన్‌ను చిత్తుగా ఓడించండి

- ఓటర్లకు కూటమి అభ్యర్థి బీటెక్ రవి వినతి



రాయలాపురంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న బీటెక్ రవి

పులివెందుల టౌన్, మే 10: పులివెందుల అసెంబ్లీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానని అందుకు రానున్న ఎన్నికల్లో తాను ఘనవిజయవం సాధించేందుకు ఓటర్లు ఆశీర్వదించాలని కూటమి అభ్యర్థి బీటెక్ రవి కోరారు. పులివెందుల మండలంలో శుక్రవారం ఆయన టీడీపీ నాయకులతో కలిసి రాయలాపురం, తుమ్మలపల్లె, మల్లికార్జునపురంలలో ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీటెక్ రవి మాట్లాడుతూ అవినీతికి పాల్పడి సంపాదించిన డబ్బుతో ఎన్నికల్లో గెలించేందుకు ప్రయత్నిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలని ప్రజలను అభ్యర్థించారు. వైసీపీ నాయకత్వం పట్ల ప్రజల్లో పూర్తిగా నమ్మకం పోయిందని, రానున్నది టీడీపీ కూటమే అన్నారు. టీడీపీ అధికారంలోకి రావడంతోనే ప్రజా సంక్షేమం ససాధ్యమన్నారు. ప్రజా సంక్షేమం కాంక్షించిన చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా మేనిఫెస్టో రూపొందించారన్నారు.బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీలలో 50ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి పింఛన్ అందిస్తామన్నారు. దివ్యాంగులకు రూ.6వేలు పింఛన్ అందించి వారికి అండఃగా నిలుస్తారన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగాలు పొందే వరకు నిరుద్యోగ భృతి కల్పించి వారిలో మనోధైర్యాన్ని నింపనున్నట్లు తెలిపారు. కులమతాలకు అతీతంగా టీడీపీని ప్రజలు ఆదరించి అత్యధిక మెజర్టీతో గెలిపించాలన్నారు. రాష్ట్రంలో భూములను దోచేందుకు జగన్‌రెడ్డి కుట్రపన్నారని, అందుకే ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చారన్నారు.వంశపారపర్యంగా తాత ముత్తాలు ఇచ్చిన ఆ స్థల తాలూక పాసుబుక్కులపై జగన్‌రెడ్డి బొమ్మ వేయించుకొని ఆస్తిపత్రాలను జిరాక్స్ కాపీలుగా మార్చడం దుర్మార్గమన్నారు. ల్యాండ్ టైటిలింగ్ చట్టంతో రైతులకు ఎలాంటి రక్షణ ఉండదని తెలిపారు. ఈసారి జగన్ గెలిస్తే ప్రభుత్వ ఆస్తులను, సచివాలయాన్ని తనఖా పెట్టినట్లు రైతుల భూములను కూడా తాకట్టుపెడతారని తెలిపారు. మీకు తెలియకుండా మీ భూములను అమ్మేస్తారని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రెండవ సంతకం ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్ రద్దుపై పెట్టి రైతులకు చంద్రబాబు ఉపశమనం కల్పిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూధన్‌రెడ్డి, మాజీ పట్టణ అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్నారెడ్డి ప్రసాదరెడ్డి, బీజేపీ లక్షుమయ్య, భరత్‌రెడ్డి, గజేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు అండగా ఉంటాం : బీటెక్ రవి

సింహాద్రిపురం, మే 10: టీడీపీ ప్రభుత్వంలో ఎస్సీలకు అండగా వుంటామని పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి) పేర్కొన్నారు. శుక్రవారం సింహాద్రిపురం మండలం గురిజాల గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో బీటెక్ రవి మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పులివెందులలో తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయడం ఖాయమని బీటెక్ రవి ధీమా వ్యక్తం చేశారు. టీడీపీ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల ద్వారా ప్రజలందరికీ న్యాయం జరిగేలా చూస్తామన్నారు. పార్టీ కోసం ఎన్నికల్లో కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీ అధికారంలోకి రాగానే తగిన గుర్తింపు ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు టీడీపీ విజయం సాధించేందుకు కృషి చేయాలని బీటెక్ రవి ప్రజలను కోరారు. అనంతరం కసనూరు గ్రామంలో బీటెక్ రవి, లతారెడ్డిలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నేత అజ్జుగుట్టు రఘునాథరెడ్డి, బీటెక్ రవి సతీమణి లతారెడ్డి, బీటెక్ రవి సోదరుడు మారెడ్డి జయభరత్‌రెడ్డి, కందుల ఓబుల్‌రెడ్డి, మురళీమోహన్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గురిజాల గ్రామంలో ఎస్సీ కాలనీలో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న బీటెక్ రవి

రైతులను నష్టపరిచేందుకే ల్యాండ్ టైటిలింగ్ యాక్టు

- జీవో జిరాక్స్ ప్రతులను దహనం చేసిన పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి

చెన్నూరు, మే 10: రాష్ట్రంలో రైతులను దగా చేసేందుకే ల్యాండ్ టైటలింగ్ యాక్టు తీసుకువచ్చారని, దీని వల్ల భూములు కొన్న రైతులు నష్టాలపాలవుతారని కమలాపురం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. చెన్నూరులో శుక్రవారం సాయంత్రం ఆయన ల్యాండ్ టైటలింగ్ యాక్టు జీవోకు నిరసనగా దాని జిరాక్స్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వాలు రైతుల శ్రేయస్సు కోసం పాటుపడితే నేటి వైసీపీ పాలకులు రైతులకు నష్టం కలిగించే చట్టాన్ని తీసుకువచ్చారన్నారు. పైగా భూములు కొన్న రైతులు చిన్న సన్న కారు రైతులయితే వాటి మధ్య సమస్యలు వస్తే రెవెన్యూ కార్యాలయం, సచివాలయం పరిష్కారం చేసే దిశగా చెప్పడం దారుణమన్నారు. న్యాయస్థానంలో తేల్చాల్సిన అంశాన్ని సచివాలయంలో, రెవెన్యూ కార్యాలయంలో వైసీపీ పాలకులకు అనుకూలంగా ఉండే సిబ్బంది ద్వారా తీర్పు సరికాదన్నారు. పైగా భూములు కొంటే వారి ఒరిజినల్ డాక్యుమెంట్లను తమ వద్ద ఉంచుకుని జిరాక్స్ ప్రతులను ఇస్తే వాటికి భద్రత ఉంటుందా అని ప్రశ్నించారు. భూములు కొన్న రైతులు తమ అవసరాలకు వాటిని అమ్ముకోవాలన్నా ఒరిజినల్ డాక్యుమెంట్లు తమ వద్ద లేక అధికారుల చుట్టూ ప్రభుత్వం చుట్టూ కాళ్లరిగేలా తిరిగాలన్నారు. ఇలాంటి జీవో చూస్తుంటే ఈ పాలకులు రాష్ట్రంలో రైతులను బతకనిచ్చేట్లు లేరన్నారు. అందుకే ఇలాంటి చట్టాన్ని ఖచ్చితంగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు సీఎం కాగానే మొదటి సంతకం మెగా డీఎస్సీపై, రెండో సంతకం ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దుపైనే ఉంటుందన్నారు. ప్రతి రైతుకు భూ రక్షణ కల్పించడమే టీడీపీ ధ్యేయమని, ఏ రైతు కూడా టీడీపీ పాలన వస్తే సంతోషంగా జీవిస్తారే తప్ప వైసీపీ వలే ఇబ్బందులపాలు చేయరన్నారు. అందుకే రైతులంతా ల్యాండ్ టైటలింగ్ యాక్టుతో నష్టపోకుండా టీడీపీని ఆదరించి చంద్రబాబును గెలిపించాలని కోరారు. కమలాపురం నియోజకవర్గంలో ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో సైకిలు గుర్తుపై ఓటు వేసి టీడీపీకి అఖండ మెజార్టీ తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనరు కె.విజయభాస్కర్‌రెడ్డి, రైతు నేతలు జగదీశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు మనోహర్‌నాయుడు, రామచంద్రారెడ్డి, శివారెడ్డి, జి.శ్రీనివాసులు, నీలం గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.





చెన్నూరులో ల్యాండ్ టైటిలింగ్ యాక్టు జిరాక్స్ ప్రతులను దహనం చేస్తున్న పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, వల్లూరులో టీడీపీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి, పెండ్లిమర్రిలో పార్టీలో చేరిన వారితో పుత్తా నరసింహారెడ్డి

టీడీపీతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి

టీడీపీతోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని కమలాపురం టీడీపీ అభ్యర్థి పుత్తా క్రిష్ణచైత్యరెడ్డి అన్నారు. చెన్నూరులో శుక్రవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. సూపర్‌సిక్స్ పథకాల గురించి వివరించారు. వైసీపీ అరాచక పాలనకు ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రజలే తీర్పునివ్వాలని కోరారు. చెన్నూరు బ్రాహ్మణవీధి, పోలయ్యగారివీధి, రెడ్డివారివీధి తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అక్కడి ప్రజలు ఘన స్వాగతం పలికారు. అలాగే పోలయ్యగారి వీధిలో వైసీపీ నుంచి యువత టీడీపీలో చేరారు. యల్లమ్మ కాలనీలో సైతం పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డికి ఘన స్వాగతం పలికి టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమాల్లో మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, డాక్టర్ ఆదర్శ్‌రెడ్డి, రామాయణం చలపతి, అమర్, ఎస్.వెంకటేశ్, మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, జి.మల్లిఖార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామనపల్లెలో చేరికలు

మండలంలోని రామనపల్లెలో మాజీ సర్పంచ్ శ్రీలక్ష్మి, ఉప సర్పంచ్ పుత్తా వేణుగోపాలరెడ్డి సమక్షంలో పలువురు టీడీపీలో చేరారు. కార్యక్రమంలో రామన చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి: మండలంలోని కొత్తగిరియం పల్లె పంచాయతీలో శుక్రవారం వైసీపీని వీడి టీడీపీలో 10 కుటుంబాలు చేరాయి. వీరికి టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పుత్తా నరసింహారెడ్డి మాట్లాడుతూ రోజురోజుకు టీడీపీలోకి వలసలు పెరుగుతున్నాయన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు టీడీపీ అండగా ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో పేర్ల శివారెడ్డి, రామిరెడ్డి, సాంబశివారెడ్డి, నాగమల్లారెడ్డి, సహదేవరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

టీడీపీ అభ్యర్థులను గెలిపించండి

టీడీపీ అభ్యర్థులను గెలిపించి రాష్ట్రాభివృద్ధికై చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుందామని టీడీపీ యువ నేత పుత్తా లక్ష్మిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని చెన్నంరాజుపల్లె గ్రామంలో పుత్తా లక్ష్మిరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించి ఘనస్వాగతం పలికారు. ఇంటింటికి తిరుగుతూ టీడీపీ అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, టీడీపీ నాయకులు నాగమల్లారెడ్డి, శివారెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వల్లూరు: మండల పరిధిలోని కోట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలో శుక్రవారం టీడీపీ ఉపాధ్యక్షుడు పుత్తా ఆధ్వర్యంలో మాచిరెడ్డిపల్లె గ్రామంలో ఆ పార్టీ తీర్థాన్ని అందుకున్నారు. వారిని పార్టీలోకి సాదరంగా పుత్తా ఆహ్వానించారు. ప్రభుత్వం రాగానే తమకు అవసరమయ్యే సంక్షేమ పథకాలతో పాటు ఎల్లవేళలా తోడుంటామని భరోసా అందించారు. స్థానిక నాయకుడు క్రిష్ణారెడ్డి, మరో నేతతో కలిపి ఈ చేరికలు జరిగాయి.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేటటౌన్, మే 10: ఐటీఐలో ప్రవేశానికి ఈ నెల 10 నుంచి ఆన్‌లైన్‌లో దర ఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గానూ అన్నమయ్య జిల్లాలోని మూడు ప్రభుత్వ, 12 ప్రైవేటు ఐటీఐలలో 1456 సీట్లు ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్లు కూడా అప్పటికప్పుడే వెరిఫికేషన్ చేయడం జరుగుతుందన్నారు. కావున విద్యార్థులు వారివారి దగ్గరున్న ఐటీఐలలో దరఖాస్తు చేసుకొని సర్టిఫికెట్లను అక్కడే వెరిఫికేషన్ చేసుకొని తదుపరి జరిగే కౌన్సిలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలియ జేశారు.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

సంబేపల్లె, మే 10: ఎన్నికల నిర్వహణలో పంచాయతీ సెక్రటరీలు అప్రమత్తంగా ఉండాలి ఎంపీడీవో నిర్మలాదేవి తెలియజేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సమస్యలను ఎప్పటికప్పుడు చేరవేయాలని తెలియజేశారు. ఓటర్లు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పై అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. ఎన్నికల సిబ్బందికి వసతులను పరిశీలించాల్సిన బాధ్యత ఉందన్నారు. భోజనాలు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ రవీంద్ర, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

మండల పూజలు

గాలివీడు, మే 10: మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం మండల పూజలు నిర్వహించారు. మార్చి 19, 20వ తేదీల్లో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ అనంతరం 48 రోజుల పాటు భక్తిశ్రద్ధల మధ్య స్వామి వారిని ఆరాధించారు.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఒంటిమిట్ట, మే 10: మండలంలోని ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని డీఎస్పీ రమాకాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమా వేశం ఏర్పాటు చేశారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని ముగ్గురికి మించి గుంపుగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా తమకు నచ్చిన వారికి ఓటు వేసుకోవాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ పురుషోత్తంరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రమాకాంత్

టీడీపీ నాయకుడు హనుమంతరెడ్డిపై రాళ్ల దాడి

రామసముద్రం, మే 10: రామసముద్రం మండలం అరికెల పంచాయతీ దాసిరెడ్డిపల్లెకు చెందిన టీడీపీ సీనియర్ నాయ కుడు హనుమం తరెడ్డిపై గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు రాళ్లతో దాడికి పాల్పడ్డారు. ఎన్నికల ప్రచారం ముగించుకుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా దుండగులు హనుమంతరెడ్డి ప్రయా ణిస్తున్న వాహనంపై మూకుమ్మడిగా రాళ్లు విసిరినట్లు బాధితుడు తెలిపారు. హనుమంతరెడ్డి తలకు బలమైన గాయం కాగా స్థానికులు అతనిని పుంగ నూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఇది వైసీపీ నాయ కుల పనేనని ఎదురుగా రాలేక దొంగచాటున దాడికి పాల్పడినట్లు బాధితుడు తెలిపారు. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు విద్యాసాగర్, బొమ్మన చెరువు శ్రీరాములు, మండల పార్టీ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌గౌడు, అల్తాఫ్, చిన్నాస్వామి, స్థానికం రాజేష్ ఆస్పత్రికి వెళ్లి హనుమంతరెడ్డిని పరామర్శించారు. ఈ విషయమై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు హనుమంతురెడ్డి తెలిపారు.



రాళ్ల దాడిలో గాయపడ్డ హనుమంతరెడ్డి

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి దుర్మరణం

నిమ్మనపల్లి, మే 10: ట్రాక్టర్ బోల్తా పడి వెంకటముని(45) అనే వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం మండలంలో చోటు చేసుకొంది. ఎస్ఐ లోకేశ్‌రెడ్డి కథనం మేరకు చౌడేపల్లి మండలం పొదలపల్లెకు చెందిన వెంకట ముని వాల్మీకిపురం మండలం చింతపర్తిలో ట్రాక్టర్ ద్వారా ఎండు గడ్డి తోలి, చౌడేపల్లెకు వస్తుండగా మార్గమధ్యంలో అగ్రహారం పంచాయతి చింతపర్తివారి పల్లె వద్ద రాత్రి సమయంలో మలుపు వద్ద ట్రాక్టర్ బోల్తా పడి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పూర్తి వివరాలు సేకరించారు. వెంకటముని ట్రాక్టర్‌ను స్పీడుగా నడపడంతోనే ప్రమాదం జరిగినట్లు తెలిపారు. వెంటనే మృతదేహాన్ని మదనపల్లె ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లి పోస్టుమార్టం చేయించారు. పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పూలంగి సేవలో చెన్నకేశవుడు

వల్లూరు, మే 10: పుష్పగిరిలో జరుగుతున్న శ్రీ కామాక్షి వైద్యనాథేశ్వరుని వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం వైభవోపేతంగా పూజలు చేశారు. అక్షయ తృతీయ సందర్భంగా శివాలయంలో భవానీ శంకరులకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం శ్రీ చక్ర సమేత కామాక్షి అమ్మవారిని పూలంగిసేవలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే కొండపైన గల చెన్నకేశవుని ఆలయంలో మూలవిరాట్ స్వామివారికి విశేషంగా పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం వివిధ పూలతో సుందరంగా స్వామివారిని అలంకరించారు. ఎప్పటిలాగానే భక్తులు జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చి పుష్పగిరి క్షేత్రంలో ఒకేసారి శివకేశవులను దర్శించుకున్నారు. భక్తులకు అవసరమయ్యే సౌకర్యాలను దేవస్థానం వారు కల్పించారు. చెన్నకేశవుని పూలంగిసేవలో చూడడం పుణ్యప్రదమన్నారు. రాత్రివేళల్లో నంది వాహనంపై వైద్యనాథేశ్వరుడు, గరుడ వాహనంలో చెన్నకేశవుని గ్రామోత్సవం జరిగింది. జగద్గురు ఆదిశంకరాచార్య పీఠంలో ప్రస్తుత పీఠాధిపతి జగద్గురు నృసింహ భారతి వారు ప్రత్యేక పూజలు చేశారు.



పూలంగి సేవలో చెన్నకేశవుడు

వివేకానందరెడ్డి కోర్కె నెరవేర్చండి

కడప, మే 10 (ఆంధ్రజ్యోతి): వివేకానందరెడ్డి చివరి కోరిక షర్మిలను ఎంపీ చేయడమే. అదేవిధంగా ఆయన తనయ డాక్టర్ సునీత అడుగులేస్తోంది. తండ్రి చివరి కోరిక కోసం షర్మిలను ఎంపీని చేసేందుకు డాక్టర్ సునీత కడప పార్లమెంట్ పరిధిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఒకపక్క ఎన్నికల ప్రచారం, మరోపక్క ముఖ్యనేతలను కలిసి వస్తున్నారు. శుక్రవారం ప్రొద్దుటూరులో టీడీపీ అభ్యర్థి వరదరాజులరెడ్డి, వైసీపీ నేతలతో పాటు మైదుకూరులో పుట్టా సుధాకర్‌యాదవ్, డీఎల్ రవీంద్రరెడ్డి, ఇతర నేతలను కలిశారు. షర్మిలను ఎంపీని చేయాలన్నది వివేకా చివరి కోరిక అని, నెరవేర్చేందుకు మీరంతా సహకరించాలని కోరారు. కాగా పార్టీలకతీతంగా సునీతకు అండగా ఉంటామని వారు హామీ ఇచ్చినట్లు తెలిసింది.

మదనపల్లెలో ఇరువర్గాల దాడి

మదనపల్లె అర్బన్, మే 10: స్థానిక పట్టణంలోని నక్కలదిన్నె తాండాలో ఓట్ల డబ్బుల విషయమై ఇరువర్గాలు దాడికి పాల్పడ్డారు. పోలీసుల వివరాల మేరకు శుక్రవారం స్థానిక నక్కలదిన్నెకు చెందిన గిరిధర్‌నాయక్, జయనాయక్, మునస్వామినాయక్, హరినాయక్‌లకు ఈశ్వర్‌నాయక్, అమరేంద్రనాయక్, వినోద్‌నాయక్‌ల మధ్య ఓట్ల కోసం ఇచ్చిన డబ్బుల విషయంగా గొడవ చోటు చేసుకుంది. తమ ఓట్లుకు సంబంధించిన డబ్బులు అందడం లేదని 25వ వార్డులోని ఓట్లు వేరే పోలింగ్ బూత్‌లకు ఎలా మారతాయని ప్రశ్నించారు. దీనికి కౌన్సిలరే బాధ్యత తీసుకుని డబ్బులు ఇప్పించే ఏర్పాటు చేయాలని వారు కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్‌ను నిలదీశారు. ఇందుకు కౌన్సిలర్ సమాధానం ఇస్తూ వార్డులో కొన్ని ఓట్లు వేరేవేరే పోలింగ్ సెంటర్‌కు మారాయని అక్కడకు వెళ్లి విచారించమని చెబుతుండగా మాట మాట పెరిగి ఇరువర్గాలు పరస్పరం ఘర్షణ పడ్డారు. కర్రలతో, రాళ్లతో మూకుమ్మడిగా దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ సీఐ వల్లీబసు కేసు నమోదు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కరెంట్ షాక్‌తో పశువులు మృతి

కాశినాయన, మే 10: వడ్డమాను గ్రామంలో గురువారం వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ తీగలు తగిలి కావూరి గురయ్య అనే రైతుకు చెందిన రెండు పశువులు మృతి చెందినట్లు పశువైద్యాధికారి డాక్టర్ రామారావు తెలిపారు. గ్రామస్థులు, బాధితుల వివరాల మేరకు.. నాలుగు రోజుల క్రితం వీచిన గాలి వానకు గ్రామ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కిందపడింది. మేతకు పోయిన పశువులు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయాయి. దాదాపు రూ.1.50 లక్షల విలువైన పశువులు చనిపోయాయని బాధిత రైతు వాపోయాడు. 4 రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ పడిపోతే విషయం తెలిసి కూడా కరెంట్ సరఫరాను నిలుపుదల చేయకపోవడం దారుణమని, సిబ్బంది నిర్లక్ష్యంతోనే పశువులు చనిపోయాయని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కరెంట్ షాక్‌తో చనిపోయిన పశువులు

ఏపీఎల్ సీజన్-3 ఎంపికలకు అనూహ్య స్పందన



రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో క్రీడాకారుల ఎంపిక దృశ్యం

కడప (స్పోర్ట్స్), మే 10: కడప నగరం రిమ్స్ సమీపంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఏపీఎల్ క్రికెట్ సీజన్-3 ఎంపికలకు అనూహ్య స్పందన లభించింది. రాయలసీమ (కడప-నెల్లూరు-అనంతపురం-చిత్తూరు-కర్నూలు) జోన్ నుంచి సుమారు 140 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసీఏ సౌత్‌జోన్ కన్వీనర్ అవ్వారు రెడ్డిప్రసాద్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఖాజామైనుద్దీన్, ఏపీఎల్ సెలక్టర్లు, కోచ్‌లు మునికుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులకు వారి మెయిల్ ఐడీకి సమాచారం పంపుతామని ఎంపిక విభాగం వారు తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రులు రెన్యువల్ చేసుకోవాలి

- డీఎంహెచ్‌ఓ నాగరాజు

పులివెందుల రూరల్, మే 10: ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా రెన్యువల్స్ చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.నాగరాజు సూచించారు. శుక్రవారం పట్టణంలోని పలు ఆసుపత్రులను ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ బాలాంజనేయులుతో కలిసి డీఎంహెచ్‌ఓ పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. ప్రతి ప్రైవేటు ఆసుపత్రులు ఏపీఎంసీ యాక్టు ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఫైర్ సేఫ్టీ మెజర్స్ ప్రతిఒక్కరూ నేర్చుకోవాలన్నారు. అప్పుడప్పుడు మాక్ డ్రిల్ చేయాలని కోరారు. ఆసుపత్రులలో జరిగిన డెలివరీలు, జననాలు, ఓపీ సర్వీసులు పరిశీలించారు. సీ సెక్షన్ డెలివరీస్ ఎక్కువ జరగకుండా చూడాలన్నారు. ఆన్‌లైన్‌లో పొందుపరచి మున్సిపాలిటీలో రిపోర్టులు సమర్పించాలని కోరారు. అనంతరం మున్సిపాలిటీలోని యర్రగుడిపల్లెలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామొయినుద్దీన్, భాకరాపురం యూపీహెచ్‌సీ డాక్టర్ శాంతికుమార్, స్టాటిస్టికల్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి, డిప్యూటీ డెమో రమణమ్మ, ఏపీఎంఓ వెంకటరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేష్, మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పులివెందులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

బొమ్మేపల్లెలో గాలివాన బీభత్సం

- గాలికి పైకి లేచిన ఇంటి పైకప్పు రేకులు

జమ్మలమడుగు, మే 10: కళ్లముందే ఇంటి పైకప్పు గాలికి లేచిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి ప్రజలు భయాందోళనకు గురయ్యాయి. అందులో భాగంగా గురువారం రాత్రి జమ్మలమడుగు గ్రామీణ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, గాలితో కూడిన వర్షం కురిసింది. ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. మండలంలోని పూర్వపు బొమ్మేపల్లె గ్రామంలో రాత్రి కురిసిన గాలీవానకు ఓ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. గునకనపల్లె లక్ష్మీదేవి రేకుల ఇళ్ల పైకప్పు గాలికి కళ్లెదురుగానే లేచిపోయి పడింది. ఇంట్లో వస్తువులు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. గ్రామంలో కరెంటు తీగలు తెగిపోయి అంధకారంగా మారింది. అలాగే ఒంటిమిద్దె తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఈ ఘటనలో బాధితురాలు లక్ష్మీదేవి తనకు దాదాపు రూ.2 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగిందని వాపోయింది.



గాలికి ఎగిరిపోయిన ఇంటి పైకప్పు



బాధిత మహిళ



నిరుపేదల ఇళ్లను నేల మట్టం చేసిన దృశ్యం (ఫైల్‌ఫొటో)

విధ్వంసం వైసీపీ నైజం

స్టే వున్నా దౌర్జన్యంగా మార్కెట్ కూల్చివేత ● వాజ్‌పేయ్‌నగర్‌లో నిరుపేదల ఇళ్లు నేలమట్టం ● రోడ్డువిస్తరణ పేరిట జెండా చెట్టు కూల్చివేత
ఇరిగేషన్ లష్కర్ క్వార్టర్స్ కూల్చివేత ● దళితుల మరుగుదొడ్లు ధ్వంసం ● టిడ్కో ఇళ్లు నేలమట్టం
ఇదీ ప్రొద్దుటూరులో రాచమల్లు విధ్వంస కాండ

'అవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తుందా' నానుడిలా వైసీపీ నేతల తీరు సాగుతోంది. సాధారణంగా ఏదైనా కొత్త ప్రభుత్వం ఏర్పడితే ఒక మంచిపని చేసి పాలనను ప్రారంభిస్తుంటారు. అయితే జగన్ ప్రభుత్వం కొత్తగా ఏర్పాటవుతూనే మొదటి పనిగా అమరావతిలోని ప్రజావేదిక భవనాన్ని కూల్చివేసి పాలన ప్రారంభించారు. ఆయన ప్రభుత్వంలో ఎన్నికైన ప్రొద్దుటూరు ఎమ్మెల్యే, జగన్‌కు వీరవిధేయుడు రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ప్రొద్దుటూరులో విధ్వంస కాండను మొదలెట్టారు. కూరగాయల మార్కెట్‌పై హైకోర్టులో స్టే వున్నా దౌర్జన్యంగా కూల్చివేయడం మొదటిది. కోర్టులు అన్నా లెక్కలేకుండా కోర్టు స్టే ఉన్నా మార్కెట్‌ను కూల్చిన ఘనుడని ఆరోపిస్తున్నారు. 'ప్రొద్దుటూరు కూరగాయల మార్కెట్‌ను కూల్చితే మొదటగా నా గుండెలమీద తొక్కుకుని వెళ్లాలని' ప్రతిపక్ష ఎమ్మెల్యేగా వ్యాపారులకు హామీ ఇచ్చిన ఆయన ఎమ్మెల్యే కాగానే మార్కెట్‌లో పచ్చిసరుకున్నా వ్యాపారులను భయభ్రాంతులకు గురిచేసి ఖాళీచేయించారు. వ్యాపారుల సామాన్లు కూడా తీసుకునేందుకు సమయం ఇవ్వకుండా నిర్ధాక్షిణ్యంగా బయటికి గెంటారు. అప్పటి మున్సిపల్ కమిషనర్ రాధను ముందు పెట్టి ఈ విధ్వంస రచన నడిపించారు. అంతేకాదు విద్యార్థులు చదువుకునేందుకు విదేశీ మహిళ (లండన్‌వాసి) అనిబీసెంట్ నిర్మించిన అనిబీసెంట్ మున్సిపల్ హైస్కూల్‌ను మార్కెట్‌కు ధారాదత్తం చేయడం వెనుక ఆదాయం పొందడమనే కుట్ర దాగిఉందని పలు ఆరోపణలున్నాయి. అనిబీసెంటు హైస్కూల్ గ్రౌండ్‌లో 2 ఎకరాలు క్రీడా మైదానం ధ్వంసం చేసి తాత్కాలిక కూరగాయల మార్కెట్‌ను నిర్మించారు. ఇందులో వ్యాపారుల నుంచి రెండు కోట్ల వరకు డబ్బు వసూలు చేసి, మున్సిపాలిటీనే నిర్మించినట్లు బిల్లులు చేసుకున్నారని బలమైన ఆరోపణలున్నాయి. పేదల కోసం టీడీపీ ప్రభుత్వం నిర్మించిన టిడ్కో ఇళ్లను, వాజ్‌పేయ్‌నగర్‌లో నిరుపేదల ఇళ్లు సైతం నేలమట్టం చేశారు. ఇరిగేషన్ లష్కర్ క్వార్టర్స్ కూల్చివేయడం, దళితుల మరుగుదొడ్లు ధ్వంసం చేసి తన వీరవిధేయతను చాటుకున్నారు రాచమల్లు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచీ రాష్ట్రంలో కక్ష పూరిత పాలన సాగించారు. ఈ విషయం సాక్షాత్తు రాచమల్లు అనుచరుడే వెల్లడించిన వీడియో వైరల్ అవు తోంది. ఇదీ ఎమ్మెల్యే రాచమల్లు నైజం, తీరు. వివరాల్లోకెళితే... - ప్రొద్దుటూరు -

దళితుల సామూహిక మరుగుదొడ్లు కూల్చివేత



మరుగుదొడ్ల కూల్చివేతపై కమిషనర్ రాధను చుట్టుముట్టిన దళితులు (ఫైల్ ఫొటో)

మున్సిపాలిటీ పరిధి 6వ వార్డు డ్రైవరుకొట్టాల, ఎర్రన్నకొట్టాల దళితుల కోసం మున్సిపాలిటీ నిర్మించిన సాముహిక మరుగు దొడ్లను కూల్చివేశారు. స్థానికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే కమిషనర్ రాధను ముందు పెట్టి కథ నడిపారు. దీనికి ఆ స్థలం ప్రైవేటు వ్యక్తుల దని వారు కోర్టుకు వెళ్లి మరుగుదొడ్లు ఖాళీ చేయించాలని ఉత్తర్వులు తెచ్చుకున్నారని కమిషనర్ రాధ తెలిపారు. గతంలో మున్సిపల్ అధికారులు సర్వే చేయకుండా కట్టారని తప్పు పట్టారు. దీంతో దళితులు ఆగ్రహించి ఆందోళన చేపట్టారు. ఎమ్మెల్యే ఇంటికి వెళ్లి బైఠాయించారు. ఎమ్మెల్యే రాచమల్లు తనకు ఈ విషయం తెలియదని అయినా కమిషనర్ చేసింది తప్పుకాదని వాదించారు. ఈ సంఘటనను 6వవార్డు వైసీపీ మాజీ కౌన్సిలర్ యామిని సీఎం జగన్ భార్య భారతి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో పైనుంచి అక్షింతలు పడడంతో తిరిగి అక్కడే దళితులకు సామూహిక మరుగుదొడ్లు రాచమల్లు దగ్గర వుండి కట్టించారు.

టిడ్కో ఇండ్లు నేలమట్టం



టీడీపీ ప్రభుత్వంలో పట్టణంలోని ఆర్‌టీఓ కార్యాలయం వద్ద 72 ఎకరాల విలువైన స్థలాల్లో నిర్మించిన టిడ్కో ఇండ్లు సెంటు స్థలాల్లో నిర్మించారు. అవి మా ఇంట్లో మరుగుదొడ్లంత లేవని, ఎలా వుంటారని ఎమ్మెల్యే రాచమల్లు ప్రశ్నించారు. వాటికి డబ్బు కట్టవద్దని ఇంటింటికీ తిరిగి టిడ్కో ఇళ్లకు వ్యతిరేకంగా ప్రచారం చేశారు. వైసీపీ అధికారంలోకి వస్తే రెండు సెంట్లలో ఉచితంగా ఇల్లు నిర్మించి ఒకచేత్తోపట్టా మరోచేత్తే తాళం ఇస్తామన్నారు. అలా ఇవ్వకుంటే 2024 ఎన్నికలకు ఈ ముఖంతో ఓట్లడగను రానన్నారు. కానీ జగనన్న కాలనీలపేర ఊరికి దూరంగా ఆవాసానికి పనిరాని భూముల్లో సెంటు స్థలంలో లబ్ధిదారులే నిర్మించుకోవాలని చెప్పి ప్రభు త్వం చేతులెత్తేసింది. రెండు సెంట్ల హామీ ఉచితంగా ఇంటి నిర్మాణం అని చెప్పి రాచమల్లు మోసం చేశారు. విలువైన టిడ్కో ఇండ్లను కూడా దక్కకుండా చేశాడు. ఆ స్థలాలను అనుడాకు అప్పగించి దాదాపు 43 ఎకరాలను జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ కింద డబ్బులున్న వారికి ప్రభు త్వం సెంటు రూ.5 లక్షల వంతున పేదలకు చెందిన టిడ్కో స్థలాలను విక్రయించి ఖజానాలో రూ 215 కోట్లు జమచేసుకున్నారు. విలువైన స్థలాల్లోపేదలు వుండకూడదనే రాచమల్లు కుట్రను పసిగట్టిన టిడ్కో లబ్ధిదారులు తీవ్ర ఆగ్రహంతో వున్నారు.

రోడ్డువిస్తరణ పేరిట జెండా చెట్టు కూల్చివేత



గవిని సర్కిల్ నుంచి వాసవీ సర్కిల్ వరకు రోడ్డు విస్తరణ చేపట్టారు. ఇందులో జెండాచెట్టు అడ్డంగా వుందని ముస్లింల మనోభావాలను పరిగణలోకి తీసుకోకుండా జెండా చెట్టును కూల్చారు. దీంతో స్వపక్షంలో విపక్షం తయారై వైసీపీలోని వైస్ చైర్మన్ ఖాజా సహా కౌన్సిలర్లు మహ్మద్‌గౌస్ ఇర్ఫాన్ గౌస్ తదితరులు ఆందోళన చేపట్టారు. వీరిని అరెస్టు చేసి వన్‌టౌన్‌కు తరలిస్తే అక్కడ కూడా బైఠాయించి రాచమల్లు దౌర్జన్య కాండపై స్వపక్షీయులే ధ్వజమెత్తారు. దీంతో రాచమల్లు నుంచి ముస్లిం కౌన్సిలర్లు దూరమయ్యారు.

ఇరిగేషన్ లష్కర్ క్వార్టర్స్ కూల్చివేత



మైదుకూరు హైవేపై వున్న ఇరిగేషన్ లష్కర్‌క్వార్టర్స్‌ను కూల్చిన దృశ్యం (ఫైల్‌ఫొటో)

మైదుకూరు రోడ్డులో హైవే పక్కన వున్న ఇరిగేన్ శాఖకు చెందిన లష్కర్ క్వార్టర్స్‌ను రాత్రికి రాత్రి కూల్చి తమ వెంచర్‌లో కలుపుకోవడానికి ఎమ్మెల్యే రాచమల్లు అన్న కిరణ్‌రెడ్డి యత్నించారు. ఇది ఇరిగేషన్ అధికారుల దృష్టికి వెళ్లడంతో వెంటనే వారు కేసు నమోదు చేయించారు. పోలీసులు కేవలం ఎక్స్‌కవేటర్ డ్రైవరుపై కేసు పెట్టి చేతులు దులిపేసుకున్నారు. దీనిపై రాచమల్లు వివరణ ఇస్తూ అక్కడ రాత్రివేళ అసాంఘిక కార్యక్రమాలు జరుగుతుంటే వాటిని కూల్చామే తప్ప ఆస్థలం కబ్జాచేయడానికి కాదని వివరించాడు. కబ్జా కథ బయట పడకుండా ఆసాంఘిక కార్యకలాపాలు అరికట్టేందుకని పోలీసుల పాత్ర తానే చేసినట్లు కొత్త కథను అల్లి ప్రజలను నమ్మించాలని చూశారు.

వాజ్‌పేయ్‌నగర్‌లో పేదల ఇళ్లు నేలమట్టం

టూటౌన్ బైపాస్ రోడ్డు మీద వున్న వాజ్‌పేయ్ నగర్ పేదలు పట్టా భూముల్లో మదూరు కాల్వ వెంట గుడిసెలు ఇండ్లు నిర్మించుకుని 30 ఏళ్లుగా నివాసముంటున్నారు. ఈ స్థలాల యజమానులు చాలా ఏళ్లగా పట్టించుకోక పోవడం, నేడు ఆ స్థలాలకు ధరలు రావడంతో వారు హైకోర్టుకు వెళ్లి ఇండ్లు ఖాళీ చేయించడానికి ఆర్డర్ తెచ్చుకున్నారు. అయితే పేదలకు న్యాయం జరగకుండా అక్కడి నుంచి ఖాళీ చేయరని ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాద్‌రెడ్డి వారికి భరోసా ఇచ్చారు. వాళ్లకు జగనన్న కాలనీలో ప్రభుత్వం స్థలాలు ఇచ్చి ఇళ్ళు నిర్మించాకే వాజ్‌పేయ్‌నగర్ నుంచి ఖాళీ చేస్తారని హామీ ఇచ్చారు. లేదంటే భూ యజమానుల నుంచి నష్టపరిహారం ఇప్పిస్తానని, ఇవ్వకుంటే నేనే ఇచ్చి మీకు ఇళ్లు కట్టిస్తానన్నాడు. కానీ పట్టా భూముల యజమానుల నుంచి కోట్లరూపాయల ముడుపులు ముట్టాక వాజ్‌పేయ్‌నగర్ వాసుల ఓట్లు నాకు వెంట్రుకతో సమానమని వారినే బెదిరించారు. దీంతో వందలాది మంది పోలీసులు రెవెన్యూ సిబ్బంది నిర్ధాక్షిణ్యంగా గుడిసెలు కూల్చి పేదలను కట్టుబట్టలతో రోడ్లపాలు చేశారు. ఈ ఆరోపణలన్నీ వాజ్‌పేయ్ నగర్‌లో గుడిసెల కూల్చివేత సందర్భంగా పేద మహిళలు రాచమల్లుకు శాపనార్థాలు పెట్టి అతని మోసకారి తనాన్ని మీడియా ఎదుటే బహిర్గతం చేశారు. ఊరంతా దోచాడు ఇప్పుడు పేదల స్థలాలు కావాలా అంటూ దుమ్మెత్తి పోశారు.



వాజ్‌పేయ్ నగర్‌లో నిరుపేదల గూళ్లు కూల్చుతున్న దృశ్యం (ఫైల్‌ఫొటో)

దూసుకుపోతున్న సైకిల్ | ఊగిసలాటలో ఫ్యాను

● కమలాపురంలో ఎమ్మెల్యే రవిరెడ్డిపై సొంత కేడరులో తీవ్ర వ్యతిరేకత
నవరత్నాలు తప్ప అభివృద్ధి శూన్యం ● భూకబ్జాలు, మట్టిమాఫియా దందా

(కడప - ఆంధ్రజ్యోతి): సీఎం జగన్ మేనమామ పి.రవీంద్రనాథరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కమలాపురంలో ఈ సారి సైకిలు జోరు కనిపిస్తోంది. గత రెండు ఎన్నికల్లో కమలాపురం జనం ఫ్యాను గుర్తుకే పట్టం కట్టి గిరగిరా తిప్పారు. ఈ సారి అప్పట్లో తిప్పిన చేతులే రివర్స్ కావడంతో ఫ్యాను వెనక్కి తిరుగుతోందని రాజకీయ పరిశీలకులు వివరిస్తున్నారు. కమలాపురంలో వరుసగా ఏ ఎమ్మెల్యే కూడా హ్యాట్రిక్ సాధించలేదు. ఇప్పుడు హ్యాట్రిక్ కోసం ఎమ్మెల్యే రవిరెడ్డి బరిలో దిగుతుండగా తొలిసారి యువకుడు పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి పోటీ చేస్తున్నారు.

పాలన కబ్జాలమయం

నియోజకవర్గంలోని పెండ్లిమర్రి, వీఎన్‌పల్లెల్లో, కొందరు కమలాపురం వైసీపీ నేతలకు నేరుగా వైఎస్ కుటుంబానికి సంబంధాలున్నాయి. దీంతో 2014 ఎన్నికల్లో రవీంద్రనాథరెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించారు. అయితే అప్పట్లో చంద్రబాబు ప్రభుత్వం ఉండేది. ప్రభుత్వం లేని కారణంగా ఎమ్మెల్యే ఏం చేయలేకపోయారని ఆ పార్టీ నేతలు కార్యకర్తలు కూడా సరే అనుకున్నారు. అయితే 2019లో వైసీపీ అధికారం చేపట్టి జగన్ సీఎం అయ్యారు. పులివెందుల తరువాత కమలాపురమే అభివృద్ధి ఉంటుందంటూ చెప్పుకొచ్చారు. అయితే అదంతా రివర్స్ అయింది. భూకబ్జాలు, మట్టి, ఇసుక దందాలకు పరిమితమైంది. జగన్ చిన్నాన్న దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డికి ఆర్టీసీ చైర్మన్ పదవి ఇచ్చారు. నియోజకవర్గమంతా రవీంద్రనాథరెడ్డి, మల్లికార్జునరెడ్డిదే రాజ్యమైంది. సీకేదిన్నె, పెండ్లిమర్రి, వీఎన్‌పల్లె, కమలాపురం వల్లూరు ఎక్కడ పడితే అక్కడ భూ ఆక్రమణలు జరిగాయి. భూములు కోసమే అధికారంలోకి వచ్చిందనే విమర్శ పార్టీకేడరులో ఉంది. మరో పక్క మల్లికార్జునరెడ్డి, ఆయన సోదరుడు వీరారెడ్డి ఇసుకను గుప్పిట్లో పెట్టుకుని లూటీ చేశారనే ఆరోపణలున్నాయి. కొప్పర్తి పారిశ్రామికవాడ, పెద్దపెద్ద కాంట్రాక్టు పనులన్నీ ఎమ్మెల్యే చేస్తారని చెబుతారు.

కేడరులో తీవ్రవ్యతిరేకత

ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డిపై కేడరులో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఆయనకు వ్యతిరేకంగా సమావేశాలు కూడా నడిపారు. పార్టీ కోసం సొంత ఆస్తులు అమ్ముకుంటే అధికారంలోకి వచ్చాక మమ్మల్ని వదలేశారనే భావన కేడరులో తలెత్తింది. గతంలో ఎన్నడూ లేని విధంగా వైసీపీ నుంచి టీడీపీలోకి క్యూకట్టారు. నియోజకవర్గంలో 80 గ్రామ పంచాయతీలకు 60 పంచాయతీల నుంచి వైసీపీ నేతలంతా సైకిలు ఎక్కేశారు. గత ఎన్నికల్లో 28వేల పైచిలుకు ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అప్పట్లో పెండ్లిమర్రి మండలంలో 7800 పైచిలుకు, వీఎన్‌పల్లె 6900, కమలాపురంలో 6వేలు, చెన్నూరు, వల్లూరులో 4వేల చొప్పున మెజార్టీ వచ్చింది. ఇప్పుడు సీన్ రివర్స్, వైసీపీలో కీలక నేతలంతా టీడీపీలోకి జంప్ అయ్యారు. సొంతపార్టీ నేతల భూములనే అన్యాక్రాంతం చేయడంతో కరుడుగట్టిన వైసీపీ అభిమానులంతా టీడీపీలోకి వలస బాట పట్టారు.

టీడీపీలో ఆత్మవిశ్వాసం

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు వెల్లువలా రావడం ఆ పార్టీలో మంచి జోష్ నింపుతోంది. టీడీపీ ఇన్‌చార్జ్ పుత్తా నరసింహారెడ్డి బలమైన నేత. గతంలో దివంగత వీరారెడ్డి, శివారెడ్డి లాగ పుత్తా నరసింహారెడ్డి కూడా బలమైన నేత, మంచి బంధువర్గం ఉంది. పుత్తా నరసింహారెడ్డి ముక్కుసూటిగా వెళతారంటారు. నాలుగుసార్లు పోటీ చేసి ఓడినా ఈ సారి కొడుకు గెలుపు కోసం తీవ్రంగా కష్టపడుతున్నారు. తన బంధువర్గం ఉత్సాహంగా పనిచేస్తున్నారు. దీనికి తోడు తెలంగాణలో బలమైన బీఆర్ఎస్ నేత, చైతన్యరెడ్డి మామ ఇక్కడే మకాం వేసి ఎన్నికల వ్యూహం రచిస్తున్నారు. రవీంద్రనాథరెడ్డి పాలన చూసిన తరువాత ఈ సారి జనం మూడ్ సైకిలుపైకి మళ్లింది. సూపర్‌సిక్స్ పథకాలు జనాల్లో కనెక్ట్ కావడం, వైసీపీ నుంచి భారీగా బలమమైన నేతలు చేరికలు గెలుపునకు ఊపుతెస్తూ జోష్ తెస్తోంది.

ఎమ్మెల్యే రవిరెడ్డి బలాలు



ఎమ్మెల్యే రవిరెడ్డి బలం సీఎం జగనే. ఆయన ఎప్పుడేకానీ నాకు ఓటు వేయమనడు. జగన్‌కు ఓటు వేయాలంటాడు. పోల్ మేనేజ్‌మెంటులో చాలా దిట్ట. చెస్‌లో బంటును ఎప్పుడు వాడా లి, ఏనుగు ఎప్పుడు వాడాలో, గుర్రం ఎప్పుడు వాడాలో, ఒంటెను ఎప్పుడు ఆడించాలో తెలిసిన వ్యక్తి. చిన్నచిన్న పనులకు కమిషన్లు తీసుకోకుండా పోవడం, ఉద్యోగాలకు డబ్బు ఆశించడు. నవరత్నాలు సంక్షేమ పథకాలు. అసంతృప్తి ఉన్న నేతలతో నేరుగా సీఎంతో ఫోను చేయించే నేర్పరి.

బలహీనతలు

సర్వరాయసాగర్ ద్వారా రైతుల భూముల కన్నా చేపల చెరువుకు నీరు తీసకెళ్లారనే రైతుల్లో ఆగ్రహం. పని అయిన తరువాత కేడరును వదలివేయడం. సీకేదిన్నె జడ్పీటీసీ పనిచేసే సమయంలో జడ్పీచైర్మన్‌గా ఉండేవారు. అప్పట్లో సీకే దిన్నె నేతలతో బాగా ఉండేవారు. ఇప్పుడు కమలాపురం ఎమ్మెల్యే కావడంతో సీకేదిన్నె, కడప నేతలను వదిలేశారనే ఆరోపణ. విపరీతమైన భూముల పిచ్చి. సొంతంగా కేడరు లేకపోవడం.

టీడీపీ అభ్యర్థి

పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి బలం



తండ్రి పుత్తానరసింహారెడ్డి వరుసగా నాలుగుసార్లు ఓడిపోవడం జనాల్లో ఈ సారి సానుభూతి. బంధువర్గమంతా కసిగా ఎన్నికల్లో పనిచేస్తున్నారు. బలమైన కేడరు ఎన్నికల రోజున పుత్తా బలంతో వైసీపీ దౌర్జన్యం చేయాలన ఆలోచన రాకపోవడం. సూపర్‌సిక్స్ పథకాలు జనాల్లో బాగా వెళ్లడం, వైసీపీ నుంచి చేరికలు. తెలంగాణ నేత అయిన మామ ప్రత్యేక పర్యవేక్షణలో ఎన్నికల ప్రచారం చేయడం.

సైకిల్ జోరు.. ఫ్యాను బేజారు



● రాజంపేటలో వేగం పుంజుకున్న సైకిల్
● ప్రజావ్యతిరేక అంశాలతో వేగం తగ్గిన ఫ్యాను

రాజంపేట, మే10: రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం గెలుపు దిశగా ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఆయన సుడిగాలి పర్యటన పూర్తి చేసుకున్నారు. ప్రచారాలు పూర్తి కావడంతో ఇక ఎన్నికల నిర్వహణపై దృష్టిసారించారు. ప్రజా వ్యతిరేక విధానాలతో నియోజకవర్గంలో వైసీపీ ఎదురీదుతోంది. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సుగవాసి బాలసుబ్రమణ్యం, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆకేపాటి అమర్‌నాధరెడ్డి పోటీ పడుతున్నారు. అయితే ఆకేపాటి అమర్‌నాధరెడ్డి ఈ ఐదేళ్లలో జరిగిన వైసీపీ వైఫల్యాలతో ఎదురీదుతున్నారు. ఆయన ప్రస్తుతం జడ్పీ చైర్మన్‌గా ఉంటూ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి మొండిచేయి చూపడంతో అమర్‌నాధరెడ్డికి సహకరించడం లేదు. దీంతో ఆయన వర్గమంతా టీడీపీ వైపు మొగ్గు చూపుతోంది. ఈ సందర్భంగా సుగవాసి బాలసుబ్రమణ్యంకు కొండత బలం చేకూరినట్లైంది. రాష్ట్రంలో ఎక్కడా జరగని విధంగా అభివృద్ధి అంశంలో ఈ ప్రాంతాన్ని అణగదొక్కిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుంది. పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని చేయకపోవడంతో నియోజకవర్గంలో వైసీపీకి శాపంలా పరిణమించింది. రాజంపేటను జిల్లా కేంద్రం చేయలేమని ఎన్నికల రోడ్ షోలో జగన్ మోహన్‌రెడ్డి స్పష్టంగా చెప్పేశారు. దీంతో రాజంపేట ప్రజలు వైసీపీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఇక అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోవడంలో వైసీపీ ప్రభుత్వం విఫలమైంది. ఈ విషయంపై సుమారు 25 గ్రామాల ప్రజలు వైసీపీ ప్రభుత్వంపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. వారికి పునరావాస చర్యలు తీసుకోకుండా, రైతులను ఆదుకోకుండా వారికి ఇంటి నిర్మాణాలు పూర్తిచేయకుండా ఉండడంతో ఆ ప్రాంతీయులంతా వైసీపీకి వ్యతిరేకంగా ఉండడంతో అమర్‌నాధరెడ్డికి ఈ అంశం ఎంతో ఇబ్బంది పెట్టేదిగా ఉంది. ఇటు మేడా మల్లికార్జునరెడ్డి పనిచేయకపోవడం, అన్నమయ్య ప్రాజెక్టు ప్రభావం ఎక్కువగా చూపడం, జిల్లా కేంద్రం వ్యవహారంతో ప్రజలు వైసీపీకి దూరంగా ఉండడంతో ఇక్కడ వైసీపీ గడ్డుపరిస్థితులు ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. అయితే ఓటుకునోటు అంశంలో ఎక్కువ ప్రభావం చూపుతున్నారు. పెద్దఎత్తున నియోజకవర్గ ప్రజలను తమ వైపు తిప్పుకోవడానికి ప్రజల్లో ఉన్న అసంతృప్తిని చల్లార్చడానికి పేద ప్రజలకు డబ్బును పెద్దఎత్తున పంచుతున్నారు. ఎక్కడా తమ అధికార తప్పిదాలు శాపాలుగా మారుతాయన్న భయంతో విచ్చలవిడిగా ప్రజలకు డబ్బు పంపిణీ చేస్తూ వైసీపీ నేతలు ముందుకు సాగుతున్నారు. ఇకపోతే రాజంపేట టీడీపీ అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం ఇప్పటికే నియోజక వర్గంలోని ఆరు మండలాలు, రాజంపేట మండలంలో పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించారు. ఆయనకు తోడుగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నిలిచింది. మూడు పార్టీల్లోనూ ప్రధాన నేతలంతా సుగవాసికి మద్దతుగా నిలిచి అన్ని మండలాల్లో, పట్టణాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారానికి అనూహ్య స్పందన లభించింది. ఎక్కడ చూసినా వీరికి తండోపతండాలుగా వచ్చి మేళతాళాలతో మంగళహారతులు పడుతూ బాలసుబ్ర మణ్యంను స్వాగతించారు. స్వచ్ఛందంగా ప్రజ లు రావడం, ఉత్సాహం గా ప్రచారాల్లో పాల్గొనడం, టీడీపీ, బీజేపీ, జనసేన కూటమికి బహిరంగంగా మద్దతు తెల పడంతో సుగవాసి గెలుపు నల్లేరుపై నడకేనని తెలుస్తోంది. ప్రధానంగా టీడీపీకి కలిసి వచ్చే అంశం జిల్లా ప్రకటన టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం నెలరోజులుగా ఎక్కడికి వచ్చినా రాజంపేటను మీ మనోభావాలకు అనుగుణంగా జిల్లా కేంద్రం చేసి తీరతానని ప్రకటించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌ను ఒప్పించి రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామని వారిచేత బహిరంగంగా ప్రకటింపచేసి విజయం సాధించారు. దీంతో సుగవాసి బాలసుబ్రమణ్యంకు ప్రజామద్దతు సంపూర్ణంగా లభించింది. జిల్లా కేంద్రం వ్యవహారంపై ప్రజలు చాలా మనోవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రం చేయని వైసీపీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. ఈ సమయంలో సుగవాసి బాలసుబ్రమణ్యం తమ అధినేత చేత జిల్లా కేంద్రం చేస్తామని ఎప్పుడైతే ప్రకటించడంతో రాజంపేట ఓటు బ్యాంకుకు మారడంలో ఎంత మాత్రం సందేహం లేదు. ఈ ప్రాంతంలో అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయిన సంఘటన రెండు స్నరేళ్లగా ఈ ప్రాంత ప్రజలను ఆగ్రహానికి గురి చేస్తోంది. ఈ అన్నమయ్య ప్రాజెక్టును వెంటనే పునఃరుద్ధరిస్తామని అధికారంలోకి వచ్చిన వెంటనే బాధితులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని పునరావాస చర్యలు తీసుకుంటామని బాలసుబ్రమణ్యం ప్రకటించడంతో కాకుండా తమ అధినేతల చేత ప్రకటింపచేశారు. దానికి తోడుగా రాజంపేటకు గతంలో మంజూరైన మెడికల్ కళాశాలను ఇతర ప్రాంతాలకు తరలించడంపై ఆగ్రహంతో ఉన్న ప్రజలకు మెడికల్ కళాశాలను తప్పక ఈ ప్రాంతంలో ఏర్పాటు చేయిస్తామని నారా చంద్రబాబు, నారా లోకేష్ చేత ప్రకటింపజేసి విజయం సాధించారు. కావున ఈ అంశాలన్నీ సుగవాసి బాలసుబ్ర మణ్యంకు కలిసివచ్చాయి. అంతకముందుగా ఎటువంటి హంగు ఆర్భాటాలు లేకుండా సాదా సీదా ప్రజాజీవనానికి అనువుగా ఉండడం, ఉన్నత విద్యావంతులు కావడం, ఆడిన మాట తప్పకపోవడం, తక్కువ మాట్లాడి ఎక్కువ పనిచేయడం రాజంపేట నియోజకవర్గ ప్రజలకు సుగ వాసి బాలసుబ్రమణ్యం అంటే మక్కువ కలిగింది. అటు అధికార పార్టీ అరాచకాలు ఆ పార్టీకి శాపంగా మారితే టీడీపీ విజయానికి కూటమి నేతల కలయిక, బాలసుబ్రమణ్యం వ్యవహార శైలి బాగా కలిసివచ్చే అవకాశముంది. ఇందు ఫలితంగా రాజంపేటలో సుగవాసి బాలసుబ్రమణ్యం గెలుపు దిశగా ముందుకు సాగుతున్నారు.



సుగవాసి బాలసుబ్రమణ్యం
టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి



ఆకేపాటి అమర్‌నాధరెడ్డి
వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి

వైసీపీని ఓడించకుంటే రాష్ట్రం మరింత పతనం




మీనాపురం, రేగలపల్లి ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి. బొల్లవరం 1 వవార్డులో వైసీపీ నుంచి టీడీపీలోకి చేరికలు

ప్రొద్దుటూరు మే 10 : వైసీపీని ఓడించకుంటే రాష్ట్రం మరింత దిగజారిపోతుందని టీడీపీ అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు.శుక్రవారం మండల పరిధిలో మీనాపురం రేగుల్లపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, ముక్తియార్, సర్పంచ్ శివచంద్రారెడ్డి మీనాపురం నాగరాజునాయుడు, మునిస్వామి, గిడ్డంగి మునిస్వామి, వెంకట సుబ్బయ్య, గొరిగే సుబ్బయ్య, చిట్టిబోయిన మునెయ్య, శేఖర్, మునిస్వామి రేగళ్ళపల్లె సీతం పల్లె సర్పంచ్ చంద్రభాస్కర్‌రెడ్డి,ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికలు ముగిసేలోపు వైసీపీ ఖాళీ ..: ఎన్నికలు ముగిసేలోపే వైసీపీ ప్రొద్దుటూరులో ఖాళీ అవుతుందని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం 1 వవార్డు బొల్లవరంలో వైసీపీకి చెందిన30 ఎస్సీ కుటుంబాలు టీడీపీలో చేరాయి.వీరికి వరద రాజుల రెడ్డిటీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో పందిటి నరేష్ శ్రీకాంత్, కార్తీక్, అఖిల్, మహేష్, శ్రావన్ ,పోతలురాజశేకర్, సంపత్ మంచాల జయరాజులు వున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, గూడా మల్లికార్జున రెడ్డి, యనమల రామసుబ్బారెడ్డి, యనమలు సుబ్బిరెడ్డి, రమణయాదవ్ పాల్గొన్నారు

50 ఏళ్లు దాటిన ఎస్సీ,బీసీ,మైనారిటీ మహిళలకు పెన్షన్ ..: టీడీపీ ప్రభుత్వం వస్తే 50 ఏళ్ళు దాటిన ఎస్సీ, బీసీ మైనారిటీ మహిళలకు 4 వేలు పెన్షను ఇస్తుందని వరదరాజులరెడ్డి కుమార్తెలు అనురాధ, అరుణమ్మ కోడలు మీనా పేర్కొన్నారు. శుక్రవారం దొరసానిపల్లె ఇంటింటికి వెళ్ళి కూటమి అభ్యర్థులను గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్తల లక్ష్మీరెడ్డి,పాతకోట భాస్కర్‌రెడ్డి, మాడెం సుధాకర్‌రెడ్డ, పాణ్యం సుబ్బరాయుడు, అరవ రాజా పాల్గొన్నారు.

ప్రజల ఆస్తులు కొల్లగొట్టే చట్టాలను రద్దుచేయాలి..: ప్రజల ఆస్తులు కొల్లగొట్టే ల్యాండ్ టైటిల్ యాక్ట్ ను వెంటనే రద్దుచేయాలని వరదరాజుల రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం రేగల్లపల్లెలో ల్యాండ్ టైటిల్‌చట్టానికి సంబంధించిన ప్రతులను టీడీపీ నాయకులు దహనం చేశారు. కార్యక్రమంలో చదిపిరాళ్ల నారాయణరెడ్డి రైతులు పాల్గొన్నారు.

బీసీలకు అండగా వుండే పార్టీ టీడీపీనే..: బీసీలకు అండగా వుండే పార్టీ టీడీపీనే అని రాబోవు ఎన్నికలలో టీడీపీకి ఓటేసి గెలిపించాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ ఓటర్లను అభ్యర్థించారు. శుక్రవారం 13 వవార్డు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీసీలకు టీడీపీ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలపై ప్రచారం చేశారు.

మార్కెట్ వ్యాపారులకు న్యాయం చేస్తాం..: కూరగాయల మార్కెట్ వ్యాపారులకు న్యాయం చేస్తామని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం అనిబిసెంట్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన తాత్కాలిక కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను సైకిల్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వీఎస్ ముక్తియార్, ఈవీ సుధాకర్‌రెడ్డి, చల్లా రాజగోపాల్ యాదవ్, కామిశెట్టిబాబు పాల్గొన్నారు.



దొరసానిపల్లె గ్రామం ప్రచారంలో పాల్గొన్న వరద కుమార్తెలు, కోడలు



13 వవార్డు ప్రచారంలో పాల్గొన్న చల్లారాజగోపాల్ యాదవ్



కూరగాయల మార్కెట్ ప్రచారంలో పాల్గొన్న వరదరాజులరెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న మల్లెల లింగారెడ్డి

ఒక్కసారి అవకాశమివ్వండి : పుట్టా




బీమఠం..తోట్లపల్లె గ్రామంలో రోడ్‌షోలో పాల్గొన్న పుట్టా సుధాకర్‌యాదవ్, టీడీపీలో చేరిన తోట్లపల్లె గ్రామ ప్రజలు

బ్రహ్మంగారిమఠం, మే 10 : ఒక్కసారి అవకాశమివ్వండి మైదుకూరు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని మైదుకూరు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ అన్నారు. శుక్రవారం బ్రహ్మంగారిమఠం మండలంలోని తోట్లపల్లె గ్రామం నుంచి రోడ్‌షో ద్వారా మల్లేపల్లె మీదుగా చెంచయ్యగారిపల్లెకు చేరుకున్నారు. చంచయ్యగారిపల్లె నాలుగురోడ్ల కూడలిలో మాట్లాడారు. అనంతరం లింగాలదిన్నెపల్లె గ్రామంలో మాట్లాడారు.

30 కుటుంబాలు పుట్టా సమక్షంలో చేరిక..: తోట్లపల్లె గ్రామానికి చెందిన రాయపురెడ్డి నరసింహారెడ్డి (తోక నరసింహారెడ్డి), గుద్దేటి నరసింహారెడ్డి (కిట్టు), రాయపురెడ్డి గోపాల్‌రెడ్డి, కాషా సంజీవరెడ్డి, మూరతోటి రవి, ఖాజీపేట పోలయ్యతోపాటు వారి అనుచర వర్గం 30 కుటుంబాలు వైసీపీ నుండి పుట్టా సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మండల ప్రచార సమన్వయ కర్త పుట్టా ఆనంద్‌యాదవ్, చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ముడుమాల పోలిరెడ్డి శ్రీయపురెడ్డి శ్రీనివాసులరెడ్డి, విశ్వనాధరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, సర్పంచ్ నారాయణ, చిలమలనాగయ్య, పట్టాభి, సేతు రాఘవేంద్ర, గంగుల వెంకట్రామిరెడ్డి,ఎత్తపు ఈశ్వర్‌రెడ్డి, శివ పాల్గొన్నారు.

మైదుకూరు..: మండలంలోని పలు గ్రామాల్లోని వైసీపీ నాయకులు శుక్రవారం టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. మండలంలోని సుంకులుగారిపల్లెకు చెందిన కుమ్మతి శ్రీనివాసులు, నారాయణరెడ్డి, అంబటి శంకర్‌రెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, పోలంరెడ్డి గంగాధర్‌రెడ్డి వారి అనుచరులు దాదాపు 20 కుటుంబాలు టీడీపీలో చేరాయి. అలాగే మండంలోని అన్నలూరుకు చెందిన రాయి శివారెడ్డి, మాచిరెడ్డి నాగేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, రామిరెడ్డి, సంజీవరెడ్డిల అనుచరులు దాదాపు 20 కుటుంబాల వారు ప్రొద్దుటూరులోని టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ నివాసానికి చేరుకొని టీడీపీలో చేరారు.

దువ్వూరు(మైదుకూరు)..: దువ్వూరు మండలం రామ్‌సాయినగర్‌కు చెందిన వైసీపీ నాయకులు పలువురు టీడీపీలో చేరారు. టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్ యాదవ్ ఎన్నికల ప్రచార నిమిత్తం గ్రామానికి చేరుకోగా, ఏరువ రామసుబ్బారెడ్డి, సుబ్బరామిరెడ్డి, లక్ష్మీనారాయణ, సుధాకర్, సతీష్‌రెడ్డి వారి అనుచరులు సుధాకర్ యాదవ్‌కు ఘనస్వాగతం పలికి టీడీపీలో చేరారు.

ఖాజీపేట..: పుట్టా సుధాకర్‌యాదవ్‌ను గెలిపించుకుందాం, మన సమస్యలను పరిష్కరించుకుందామని టీడీపీ మండలాధ్యక్షుడు లక్ష్మీరెడ్డి, దుగ్గిరెడ్డి సరళ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నాగపట్నం, పత్తూరు, సీతానగరం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

చాపాడు..: ఎన్నికల్లో తనకు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని మైదుకూరు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి పుట్టా సుధాకర్‌యాదవ్ కోరారు. శుక్రవారం ఆయన భద్రిపల్లె, నెర్రవాడ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.



మైదుకూరు.. టీడీపీలో చేరిన అన్నలూరుకు చెందిన వైసీపీ నాయకులు



మైదుకూరు.. పుట్టా సమక్షంలో టీడీపీలో చేరిన రామ్‌సాయినగర్ వాసులు



పుట్టా సుధాకర్‌యాదవ్ సమక్షంలో టీడీపీలో చేరిన సుంకులుగారిపల్లె ప్రజలు



ఖాజీపేట.. నాగపట్నంలో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

టైటిల్ యాక్ట్... నల్లచట్టంతో సమానం



జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో టైటిల్ యాక్టు ప్రతులను దహనం చేస్తున్న భూపేష్‌రెడ్డి



కాంబల్లెలో ఎన్నికల ప్రచారంలో భాగంగా భూపేష్‌రెడ్డి పక్కన ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

● టీడీపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డి

కడప, మే 10 (ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కుల చట్టం రైతు భూములను హరించే చట్టం. ఇది ఒకరకంగా నల్లచట్టమని టీడీపీ పార్లమెంట్ అభ్యర్థి భూపేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రం జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో టీడీపీ నేతలు చదిపిరాల్ల గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో టైటిల్ యాక్ట్ ప్రతులను దగ్ధం చేశారు. అలాగే పులివెందుల నియోజకవర్గంలోని సింహాద్రిపురం మండలం కాంబల్లెలో ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ జగన్ తీసుకొచ్చిన లల్యాండ్ టైటిల్ యాక్టుతో ఎవరి భూములకు భద్రత లేదన్నారు. మీ భూములు మీవి కావు. జగన్ వస్తే అవన్నీ వైసీపీ నేతల వశం అవుతాయి. ఇప్పటికే జగన్ అనుచరులు ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులను కొల్లగొట్టారు. మళ్లీ జగన్ సీఎం అయితే మీ ఆస్తులను దోచేస్తారు. మీ భూమి, మీ స్థలాలు మీకు రావాలంటే జగన్ పార్టీని ఓడించండి. చంద్రబాబు సీఎం అయితే ఆ యాక్టును రద్దుచేస్తామంటూ హామీ ఇచ్చారు. ప్రైవేటు ఆస్తుల భద్రత కాదు జనం ఆస్తుల కోసం టీడీపీ భరోసాగా ఉంటటుంది. కేంద్రంలో మోడీ ప్రధాని అయి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే మన సమస్యలన్నీ తీరి స్టీల్ ఫ్యాక్టరీ వస్తుంది.

బద్వేలు ఆర్టీసీ డిపో పరిశీలన

బద్వేలు, మే 10: బద్వేలు ఆర్టీసీ డిపో స్లాబు పెచ్చులూడి ఓ మహిళపై పడి గాయాలైన ఘటన ఈ నెల 9వ తేదీన జరిగింది. దీనికి స్పందించిన రాయలసీమ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు, సివిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమణ శుక్రవారం ఆర్టీసీ బస్టాండులో పరిశీలించారు. పెచ్చులూడిన బస్టాండును పరిశీలించి నెలలోపు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని డీఎం శ్రీనివాసరావుకు సూచించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండు డిపో గ్యారేజీని ఆయన పరిశీలించారు. ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ఆర్టీసీ ధ్యేయమన్నారు. అనంతరం విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాసరావు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాయక్ పాల్గొన్నారు.



ఆర్టీసీ బస్టాండును పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

పోలీసు కవాతు

ప్రొద్దుటూరు క్రైం, మే 10 : ఒకటో పోలీస్ స్టేషన్ పరిధిలో కేంద్ర సాయుధ బలగాలతో శుక్రవారం పోలీసు కవాతు నిర్వహించారు. ముగ్గురు ఐపీఎస్ అధికారులతో పాటు వన్ టౌన్ సీఐ శ్రీకాంత్, ఎస్ఐ హైమావతి పోలీసు సిబ్బందితో కలిసి పర్యటించారు. రామేశ్వరం, మిట్టమడి వీధి, వరలక్ష్మి ఆపార్టుమెంట్స్, గురువయ్యతోట, ఆర్ట్సుకాలేజీరోడ్డు, గాంధీరోడ్డు, బీజీఆర్ వీధి, కేఎస్ఎం స్ట్రీట్‌లో కేంద్ర బలగాలతో, ఫ్లాగ్ మార్చ్ పాల్గొన్నారు. ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించడమే లక్ష్యంగా పోలీసులు సంకల్పించారు.

ప్రజల్లో ఉన్న భయాందోళలను పోగొట్టి, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పోలీసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించబోతున్నాం... కూటమిదే విజయం

బద్వేలుటౌన్, మే 10 : జరగబోవు ఎన్నికల్లో చరిత్ర సృష్టించబోతున్నాం, కూటమిదే విజయమని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో మాజీ ఎమ్మెల్యే విజయమ్మ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జరోశన్నకు కమలంగుర్తుపై ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం వైసీపీని వీడి టీడీపీలోకి సుబ్బరాయుడు యాదవ్(గుజరాత్) ఆధ్వర్యంలో 50 కుటుంబాలవారు టీడీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో సింగరయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ పార్థసారధి, నాగభూషణం, పీవీఎన్ ప్రసాద్, కొంకుల రామక్రిష్ణ, కొంకుల రవికుమార్, గురురాజా, గోపాల్‌రెడ్డి, గుణమంతురాజేష్, కొంకుల రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి..: టీడీపీ అధినేత చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే విజయమ్మ అన్నారు. శుక్రవారం మున్సిపాలిటీపరిధిలోని 29వ వార్డు, కుమ్మరికొట్టాలు, గుంతపల్లెకాలనీల్లో వైసీపీని వీడి 120 కుటుంబాలవారు టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో నరసింహనాయుడు, జీవీ సుబ్బారెడ్డి, శివ, రామ్మూర్తినాయుడు, ప్రసాద నాయుడు, శంకర్‌రెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను దగా చేయడమే వైసీపీ ప్రభుత్వ లక్ష్యం..: ప్రజలను దగాచేయడం వైసీపీ ప్రభుత్వ లక్ష్యమని మాజీ ఎమ్మెల్యే లింగారెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పుట్టాయపల్లె, గొడుగునూరు లో ఇంటింటికి వెళ్లి కమలంగుర్తుకే ఓటు వేయాలంటూ ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శిరిషారెడ్డి, జయరామి రెడ్డి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాశినాయన..: నర్సనపల్లె, మూలపల్లె గ్రామాల్లో శుక్రవారం బద్వేల్ నియోజకవర్గ ఎన్డీఏ అభ్యర్థి బొజ్జా రోశన్న ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీచేస్తూ బీజేపీ కమలం గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఓటర్లను కోరారు.ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు హోండా రవీంద్రారెడ్డి, నర్సాపురం సర్పంచ్ ఖాజావలి,వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, లక్షుమయ్య స్థానిక నాయకులు ఇతర కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్డీఏ కూటమి అభ్యర్థిని గెలిపించండి

బద్వేలు రూరల్..: బద్వేలు నియోజకవర్గ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బొజ్జ రోశన్నను గెలిపించాలని టీడీపీ రాష్ట ఉపాధ్యక్షుడు మల్లేల లింగారెడ్డి కోరారు. శుక్రవారం మండల పరిధిలోని పుట్టాయపల్లె, గొడుగునూరు గ్రామాల్లో బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్నతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శిరీషారెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు జయరామిరెడ్డి, మాజీ ఎంపీపీ బైసాని ప్రతాప్‌రెడ్డి, టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.కాగా ఎన్డీఏ కూటమి బీజేపీ అభ్యర్థి బొజ్జ రోశన్నను గెలిపించాలని మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టరు మహబూబ్ బాషా, జహంగీర్‌బాషా కోరారు. శుక్రవారం పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లోని వ్యాపారుల వద్దకు, పూలు, పండ్ల దుకాణాల వద్దకు వెళ్లి ప్రచారాన్ని నిర్వహించారు.

పోరుమామిళ్ల..: రంగసముద్రం పంచాయతీ పరిధిలోని పోలింగ్ బూత్ పరిధిల్లో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈవీయంలతో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు ఓటర్లతో మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థిగా బొజ్జ రోశన్నను, ఎంపీ అభ్యర్థిగా భూపేశ్ రెడ్డిని గెలిపించాలని ప్రచారం చేశారు. కార్యక్రమంలో బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.కాగా వైసీపీ నుంచి 25 కుటుంబాలు మాజీ ఎమ్మెలేయ విజయమ్మ సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొండా రామిక్రిష్ణా రెడ్డి, మల్లికార్జునరెడ్డి, తిరుమలశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు. సంచర్ల పంచాయతీ పరిధిలోని ఎస్టీకాలనీలో ఎస్.రమణయ్య, రామయ్య, సి.వెంకటయ్యతో పాటు ఐదు కుటుంబాల వారు చెన్నరెడ్డిపేటకు చెందిన సిద్దురామసుబ్బారెడ్డి, గాజులపల్లె కొండారెడ్డి, సిద్దు పెద్దారెడ్డితో పది కుటుంబాల వారు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు కలవకూరి నడిపి వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

బి.కోడూరు..: కమలం గుర్తుపై ఓట్లు వేసి నన్ను ఆదరించి గెలిపించండి, అభివృద్ధి చేసిచూపిస్తానని కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్న ఓటర్లకు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని రాజుపాలెం, టమటం వారిపల్లె, తువ్వపల్లె, క్రిష్ణాపురం, సిరిగిరిపల్లె, పందివీడు, మూలవారిపల్లె గ్రామాల్లో పార్టీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, రైతు విభాగ అధ్యక్షుడు రమణారెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేశారు.కూటమి అభ్యర్థి బొజ్జ రోశన్నతో పాటు తనయుడు బొజ్జ కార్తీక్ కూడా పాల్గొని ఇంటింట ప్రచారం నిర్వహించారు. గోడి రమణారెడ్డి, శేషారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, తిరుపతిరెడ్డి, పి.సుబ్బారెడ్డి, దుగ్గిరెడ్డి, బాల య్య, పవన్, నరసింహులు, రామ్మోహన్‌రెడ్డి, బాలిరెడ్డి, క్రిష్ణయ్య పాల్గొన్నారు.

అట్లూరు..: మండలంలోని కొనరాజుపల్లె, మాడపూరు, అట్లూరు, ఈమలకూరు, మన్నెంవారిపల్లె గ్రామాల్లో ఎన్డీఏ కూటమి నాయకులు విస్తృతంగా శుక్రవారం ప్రచారం చేశారు. బొజ్జ రోశన్న కమలం గుర్తుకు కడప ఎంపీ భూపేశ్‌రెడ్డికి సైకిలు గుర్తుకు ఓటు వేయాలంటూ ఈవీయంను చూపిస్తూ ఓటు వేసే విధానాన్ని అవగాహన కల్పిస్తూ ప్రచారం చేశారు. కార్యక్రమంలో మద్దిక పుల్లారెడ్డి, పోతిరెడ్డి సుబ్బారెడ్డి, పరంధామరెడ్డి, మద్దిక గోపాల్‌రెడ్డి, చెంచురెడ్డి, సుబ్బారెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, గంగాగిరిరాజు పాలచెంచురెడ్డి, లేవాకు రామక్రిష్ణరెడ్డి, మన్యంమహశ్వర్‌రెడ్డి, సుదర్శన్‌రావు, రామసుబ్బారెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.కాగా రెడ్డిపల్లె గ్రామవాసులువైసీపీ నుంచి 20 కుటుంబాలు పాటూరు రాధాక్రిష్ణారెడ్డి, చిలికి క్రిష్ణారెడ్డి, రామసుబ్బారెడ్డి,చిన్న రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో రితీష్‌రెడ్డి నివాసంలో టీడీపీలో చేరారు.



బీకోడూరు.. టమటంవారిపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న బొజ్జ రోశన్న



బద్వేలు.. గొడుగునూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు



బద్వేలు.. ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ

నిఘా నీడలో ఎన్నికలు

● నేటి సాయంత్రంతో ప్రచారం ముగింపు ● అంతటా 144 సెక్షన్ అమలు

మైదుకూరు, మే 10 : మైదుకూరు నియోజకవర్గంలో నిఘా నీడలో ఎన్నికలు నిర్వహిస్తున్నామని, 87 సమస్యాత్మకత పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి మైక్రో అబ్జర్వ్లలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో పాటు ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా అభ్యర్థులు సహకరించాలని ప్రత్యేక పరిశీలకుడు భానుదాస్ పాల్వే, రిటర్నింగ్ అధికారి చంద్రమోహన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శుక్రవారం అభ్యర్థులతో సమావేశం నిర్వహించారు. శనివారం సాయంత్రం 6 లోపు తమ ప్రచారాలు ముగించాలని, ఆది, సోమవారాలు అనుమతి ఉన్న వాహనాలు మాత్రమే నడపాలని, పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరంలోనే ప్రెస్‌మీట్‌లు పెట్టుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రంలోకి సెల్ ఫోన్లు, ఇతర యాంత్రిక పరికరాలను అనుమతి లేవన్నారు. ఎన్నికల్లో 27 అత్యంత సమస్యాత్మక కేంద్రాలు, 87 కేంద్రాలను సమస్యాత్మకత పోలింగ్ కేంద్రాలుగా గుర్తించి అక్కడ సీసీ కెమారాలతో పాటు మైక్రో అబ్జర్వ్లలను నియమించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేసులు, ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.



మైదుకూరులో మాట్లాడుతున్న అధికారులు

జమ్మలమడుగు..: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా, ప్రశాంతంగా జరిగేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు, డీఎస్పీ యశ్వంత్ హెచ్చరించారు. శుక్రవారం జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయ సభాభవనంలో పొలిటికల్ పార్టీ నేతల ప్రతినిధులకు అత్యవసర సమావేశం నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సంబధిత అభ్యర్థిపై కేసు నమోదు చేస్తామన్నారు. అందుకు 11వ తేదీ సాయంత్రం లోగా ప్రచారం పూర్తవుతుందని, 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. కాగా ఈనెల 11వ తేదీ 144 సెక్షన్ అమలుతోపాటు నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో మూడు రోజులపాటు పోలీసు నీడలో ప్రత్యేక నిఘా ఉంటుందని డీఎస్పీ యశ్వంత్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు సౌజన్యలక్ష్మీ, కరుణాకర్, పొలిటకల్ పార్టీ నేతలు, ప్రతినిధులు శంకర్‌రెడ్డి, రామాజి ఇమ్మానుయేల్, అల్లె సాకేత్‌రెడ్డి, పుల్లారెడ్డి, పోచిరెడ్డి, గంగాధర్, సిబ్బంది వివేకానందరెడ్డి, భరత్, షఫి, నరేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు..: పోలింగ్ రోజున అభ్యర్థులు, ఏజంట్లు చట్టపరిధిలో నడుచుకోవాలని డీఎస్పీ మురళీధర్ హెచ్చరించారు. శుక్రవారం తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆర్‌వో సమావేశం నిర్వహించారు. ఈసమావేశానికి ఎన్నికల పరిశీలకులు భాను దాసు పాల్వే అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ స్వతంత్ర అభ్యర్థులు వాహనాలకు అనుమతి తీసుకుని వేరే పార్టీ అభ్యర్థులకు ఇచ్చినట్లయితే ఆ వాహనాన్ని సీజ్ చేస్తామన్నారు. పోలింగ్ రోజున అభ్యర్థులు పాటించవలసిన వాటిపై సూచనలు ఇచ్చారు. ఆర్‌వో కౌసర్ బాను మాట్లాడుతూ స్ట్రాంగ్ రూముల అన్ని ఏర్పాట్లు పూర్తిఅయ్యాయన్నారు. అనంతరం ఎన్నికల పరిశీలకుడు భానుదాసుపాల్వే పట్టణంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు, ఆయన వెంట తహసీల్దారు విద్యాసాగర్, కమిషనర్ రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

అట్లూరు..: పోలింగ్‌రోజున కేంద్రాల వద్ద నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని బద్వేలు రూరల్ సీఐ విక్రమ్‌సింహ తెలిపారు. శుక్రవారం పోలీసుస్టేషన్ నందు వివిధ పార్టీల నాయకులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అట్లూరు ఎస్ఐ కేశవరాజు, పోలీసు సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

బొమ్మేపల్లెలో గాలివాన బీభత్సం

● గాలికి పైకి లేచిన ఇంటి పైకప్పు రేకులు

జమ్మలమడుగు, మే 10: కళ్లముందే ఇంటి పైకప్పు గాలికి లేచిపోయింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షానికి ప్రజలు భయాందోళనకు గురయ్యాయి. అందులో భాగంగా గురువారం రాత్రి జమ్మలమడుగు గ్రామీణ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులు, గాలితో కూడిన వర్షం కురిసింది. ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. మండలంలోని పూర్వపు బొమ్మేపల్లె గ్రామంలో రాత్రి కురిసిన గాలీవానకు ఓ ఇంటి పైకప్పు రేకులు ఎగిరిపోయాయి. గునకనపల్లె లక్ష్మీదేవి రేకుల ఇళ్ల పైకప్పు గాలికి కళ్లెదురుగానే లేచిపోయి పడింది. ఇంట్లో వస్తువులు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. గ్రామంలో కరెంటు తీగలు తెగిపోయి అంధకారంగా మారింది. అలాగే ఒంటిమిద్దె తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. ఈ ఘటనలో బాధితురాలు లక్ష్మీదేవి తనకు దాదాపు రూ.2 లక్షలకు పైగా ఆస్తినష్టం జరిగిందని వాపోయింది.



గాలికి ఎగిరిపోయిన ఇంటి పైకప్పు



బాధిత మహిళ

ఏపీఎల్ సీజన్-3 ఎంపికలకు అనూహ్య స్పందన

కడప (స్పోర్ట్స్), మే 10: కడప నగరం రిమ్స్ సమీపంలోని వైఎస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో శుక్రవారం జరిగిన ఏపీఎల్ క్రికెట్ సీజన్-3 ఎంపికలకు అనూహ్య స్పందన లభించింది. రాయలసీమ (కడప-నెల్లూరు-అనంతపురం-చిత్తూరు-కర్నూలు) జోన్ నుంచి సుమారు 140 మంది క్రీడాకారులు హాజరయ్యారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏసీఏ సౌత్‌జోన్ కన్వీనర్ అవ్వారు రెడ్డిప్రసాద్, అసిస్టెంట్ డెవలప్‌మెంట్ మేనేజర్ ఖాజామైనుద్దీన్, ఏపీఎల్ సెలక్టర్లు, కోచ్‌లు మునికుమార్‌రెడ్డి హాజరయ్యారు. ఎంపికైన క్రీడాకారులకు వారి మెయిల్ ఐడీకి సమాచారం పంపుతామని ఎంపిక విభాగం వారు తెలిపారు.



రాజారెడ్డి క్రికెట్ స్టేడియంలో క్రీడాకారుల ఎంపిక దృశ్యం

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడు మృతి



రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన శివకుమార్

కొండాపురం, మే 10: మండలంలోని ఏటూరు గ్రామ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని శివకుమార్ (16) అనే యువకుడు మృతి చెందాడు. మండలంలోని తాళ్లప్రొద్దుటూరు గ్రామానికి చెందిన చింతకాయల శివకుమార్ మైలవరం గ్రామానికి బైకులో వెళ్తుండగా ఎదురుగా గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొంది. దీంతో ఈయన తలకు తీవ్ర గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కొండాపురం ఎస్ఐ యోగీంద్ర తెలిపారు.

ఆది గెలుపును అడ్డుకోలేరు : అరుణ



ఎర్రగుంట్లలో ప్రచారం నిర్వహిస్తున్న ఆదినారాయణరెడ్డి సతీమణి అరుణ, ఇతర నాయకులు, ముద్దనూరులో ప్రచారంలో ముస్లింలు

ఎర్రగుంట్ల, మే 10: మండలాన్ని అభివృద్ధి చేసిన ఆదినారాయణరెడ్డి గెలుపును ఎవరూ ఆపలేరని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆది సతీమణి సి.అరుణ పేర్కొన్నారు. శుక్రవారం ఆమె ఎర్రగుంట్ల నడివూరులో మాజీ ఎంపీటీసీలు ఎస్.సూర్యనారాయణరెడ్డి, బాలనారాయణరెడ్డి, మాజీ కౌన్సిలర్ పార్వతమ్మ, కత్తిప్రతాప్‌రెడ్డి, కోగటం నారాయణరెడ్డి, జిల్లెళ్ల రఘునాథరెడ్డి, జీ.చంద్ర, జనసేన నాయకుడు జగదీష్ తదితరులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఎంపీ అభ్యర్థి సి.భూపేష్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్న సి.ఆదినారాయణరెడ్డిలను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంకిరెడ్డి, షరీఫ్, మహేష్, శివారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హనుమనగుత్తి, బిస్మిల్లాబాద్‌లో చేరికలు..

హనుమనగుత్తి, బిస్మిల్లాబాద్‌కు చెందిన సుమారు 60 కుటుంబాలు శ్రీరాములు, ప్రసాద్, గుర్రప్ప, ఉత్తమయ్య, రమేష్ తదితరులు గోపాల్‌రెడ్డి సమక్షంలో బీజేపీ కండువాను కప్పుకున్నారు.

కొండాపురం: మండలంలోని కొండాపురం గ్రామంలో మండల బీజేపీ ఇన్‌చార్జి శివనారాయణరెడ్డి సమక్షంలో శుక్రవారం పలువురు ఎన్డీయే కూటమిలో చేరారు. కొండాపురం గ్రామానికి చెందిన రామయ్య, దుబ్బశీను తదితరులు ఎన్డీయే కూటమిలో చేరారు. ఈ సందర్భంగా శివనారాయణరెడ్డి కండువాలు కప్పి వారిని ఎన్డీయేలో కూటమిలోకి ఆహ్వానించారు .రాబోయే ఎన్నికల్లో ఎన్డీయే కూటమి జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి,కడప ఎంపీ అభ్యర్థి భూపేశ్‌రెడ్డి గెలుపే ధ్యేయంగా పనిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గండ్లూరు శంకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముద్దనూరు: ఎన్డీయే కూటమి అభ్యర్థుల విజయం కోసం ముస్లింలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ముద్దనూరు టౌన్‌లో మైనారిటీ నాయకులు ఖాదర్‌ఖాన్, అబ్దుల్‌ఖాన్ ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదినారాయణరెడ్డి, టీడీపీ ఎంపీ అభ్యర్థి భూపేష్‌రెడ్డిని గెలిపించాలని కోరారు.అలాగే ముద్దనూరులో షాదీఖానా ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాబాఅమీర్, నౌరిన్‌బేగం, అక్బర్‌అలీఖాన్, ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆసుపత్రులు రెన్యువల్ చేసుకోవాలి

● డీఎంహెచ్‌ఓ నాగరాజు

పులివెందుల రూరల్, మే 10: ప్రైవేట్ ఆసుపత్రులు తప్పనిసరిగా రెన్యువల్స్ చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.నాగరాజు సూచించారు. శుక్రవారం పట్టణంలోని పలు ఆసుపత్రులను ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ బాలాంజనేయులుతో కలిసి డీఎంహెచ్‌ఓ పలు ఆసుపత్రులను తనిఖీ చేశారు. ప్రతి ప్రైవేటు ఆసుపత్రులు ఏపీఎంసీ యాక్టు ప్రకారం రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, ఫైర్ సేఫ్టీ మెజర్స్ ప్రతిఒక్కరూ నేర్చుకోవాలన్నారు. అప్పుడప్పుడు మాక్ డ్రిల్ చేయాలని కోరారు. ఆసుపత్రులలో జరిగిన డెలివరీలు, జననాలు, ఓపీ సర్వీసులు పరిశీలించారు. సీ సెక్షన్ డెలివరీస్ ఎక్కువ జరగకుండా చూడాలన్నారు. ఆన్‌లైన్‌లో పొందుపరచి మున్సిపాలిటీలో రిపోర్టులు సమర్పించాలని కోరారు. అనంతరం మున్సిపాలిటీలోని యర్రగుడిపల్లెలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఖాజామొయినుద్దీన్, భాకరాపురం యూపీహెచ్‌సీ డాక్టర్ శాంతికుమార్, స్టాటిస్టికల్ ఆఫీసర్ రమేష్‌రెడ్డి, డిప్యూటీ డెమో రమణమ్మ, ఏపీఎంఓ వెంకటరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ నరేష్, మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



పులివెందులలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

ఇంటింటి ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్న బొజ్జ రోశన్న



బద్వేలు నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

● సూపర్ సిక్స్ పథకాలతో ఇంటింటా సంక్షేమం

● ప్రజాసేవకే నా జీవితం అంకితం

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

బద్వేలుటౌన్, మే 10: నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని బద్వేలు నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న పేర్కొన్నారు. సాగు, తాగునీటి పథకాలను బాగుచేసి, బద్వేలు నియోజకవర్గ రైతాంగాన్ని ఆదుకుంటామన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో ఇంటింటా సంక్షేమ పథకాలను అర్హులందరికీ సజావుగా అందేలా కృషి చేస్తామని తెలిపా రు. ఉన్నత ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని, తన జీవితం ప్రజాసేవకే అంకితమన్నారు. ఆయన ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు.



ప్రశ్న: ఉద్యోగం వదిలి రాజకీయాల్లోకి వచ్చారు కదా? ఎలా ఉంది ?

జవాబు: ఉన్నత ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చాను. నియోజకవర్గ ప్రజల ఆదరణ, ప్రేమాభిమానాలను చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది. నా జీవితం ప్రజాసేవకే అంకితం.

ప్రశ్న: ప్రస్తుతం ఎన్నికల ప్రచారం ఎలా సాగుతోంది?

జవాబు: చాలా ఉత్సాహంగా సాగుతోంది. ఏ గ్రామం, ఏ వీధి, ఏ వార్డుకు వెళ్లినా ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. మండుటెండలను లెక్కచేయకుండా కూటమి నాయకులు, కార్యకర్తలు ప్రచారంలో పాల్గొనడం సంతోషంగా ఉంది.



బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోశన్న

ప్రశ్న: గత వైసీపీ ప్రభుత్వ పాలకుల తీరుపై ఏమంటారు ?

జవాబు: వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో అన్ని రంగాలు కుదేలయ్యాయి. అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. విద్యుత్తు బిల్లుతో సామాన్య ప్రజలకు షాక్ కొడుతోంది. రాష్ట్రమంతా అరాచకం కొనసాగుతోంది. ప్రశ్నిస్తే దౌర్జన్యాలకు, దాడులకు పాల్పడుతున్నారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లేక వలసలు వెళుతున్నారు. ఉద్యోగులకు సక్రమంగా జీతాలు వేయకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అరాచక పాలనకు విముక్తి కలిగించేందుకే టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిగా ఏర్పడ్డాయి.

ప్రశ్న: నియోజకవర్గంలో మీ దృష్టికి వచ్చిన ప్రధాన సమస్యలు ఏమిటి ?

జవాబు: నిరుద్యోగం, మౌలిక వసతులు, సాగు, తాగునీటి ఇబ్బందులు, రైతులకు గిట్టుబాటు ధరలు లేకపోవడం తదితర సమస్యలు తమ దృష్టికి వచ్చాయి. ఎన్డీఏ కూటమి గెలిచిన వెంటనే సమస్యలను పరిష్కరిస్తాం.

ప్రశ్న: కూటమి ప్రవేశపెట్టిన మేనిఫెస్టోతో ప్రజల స్పందన ఏమిటి ?

జవాబు: ఎన్డీఏ కూటమి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపుతాయన్న ధీమా దూసుకెళ్లడంతో ప్రజల్లో మంచి స్పందన ఉంది. ఇంటింటి ప్రచారంలో ప్రతి విద్యార్థికి ఏటా రూ.15 వేలు, నిరుద్యోగభృతి కింద రూ.3 వేలు, ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు, వృద్ధులకు రూ.4 వేల పెన్షన్, దివ్యాంగులకు రూ.6 వేలు, కిడ్నీ, తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారికి రూ.10 వేల పెన్షన్ అందించడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు ఏటా రూ.20 వేలు వంటి అన్ని పథకాలను ప్రజలకు వివరిస్తూ ప్రచారం చేయడంతో ప్రజల నుంచి విశేషస్పందన లభిస్తోంది.

ప్రశ్న: మీరు ఎమ్మెల్యే అయితే నియోజకవర్గానికి ఇచ్చే భరోసా ఏమిటి ?

జవాబు: అధికారంలోకి వచ్చిన వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సహకారాలతో నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్ది, సోమశిల బ్యాక్‌వాటర్ ద్వారా బద్వేలు, గోపవరం మండల పరిధిలో ఉన్న చెరువులకు నీటిని నింపి, సుమారు 40 వేల ఎకరాలకు సాగునీటిని అందించి, బ్రహ్మంసాగర్ ద్వారా బద్వేలు మున్సిపాలిటీకి తాగునీరు ప్రజలకు సక్రమంగా అందేలా చర్యలు తీసుకొని, చిత్తశుద్ధితో పనిచేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా.

ప్రశ్న: ప్రచారంలో కూటమి పార్టీల సహకారం ఎలా ఉంది ?

జవాబు: టీడీపీ, జనసేన, బీజేపీ కలయికతో మా బలం మరింత పెరిగింది. ప్రతిఒక్కరూ తమ బాధ్యతగా గెలుపే లక్ష్యంగా నియోజకవర్గంలో ప్రతి గడపకు వెళుతూ, ప్రతి ఓటరును పలుకరిస్తూ, అందరం సమన్వయంతో ప్రచారం చేస్తూ ఉత్సాహంగా ముందుకు వెళుతున్నాం.

ప్రశ్న: ప్రచారంలో మీ కుటుంబసభ్యుల సహకారం ఎలా ఉంది ?

జవాబు: నా భార్య, నా కుమారుడు, మా అన్నా తమ్ముళ్లు ఇలా మా కుటుంబ సభ్యులంతా సహకరించుకుంటూ ప్రచారం చేస్తూ వారి ప్రోత్సాహంతో ముందుకు వెళుతున్నాం.

నిర్భయంగా ఓటుహక్కు వినియోగించుకోవాలి

ఒంటిమిట్ట, మే 10: మండలంలోని ప్రజలు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని డీఎస్పీ రమాకాంత్ అన్నారు. శుక్రవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో 144 సెక్షన్ అమల్లో ఉందని ముగ్గురికి మించి గుంపుగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఘర్షణలు, అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురికాకుండా తమకు నచ్చిన వారికి ఓటు వేసుకోవాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ పురుషోత్తంరాజు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ రమాకాంత్

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

రాజంపేటటౌన్, మే 10: ఐటీఐలో ప్రవేశానికి ఈ నెల 10 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యాసంవత్సరానికి గానూ అన్నమయ్య జిల్లాలోని మూడు ప్రభుత్వ, 12 ప్రైవేటు ఐటీఐలలో 1456 సీట్లు ఉన్నాయని తెలిపారు. 10వ తరగతి పాసైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అప్లికేషన్లు కూడా అప్పటికప్పుడే వెరిఫికేషన్ చేయడం జరుగుతుందన్నారు. కావున విద్యార్థులు వారివారి దగ్గరున్న ఐటీఐలలో దరఖాస్తు చేసుకొని సర్టిఫికెట్లను అక్కడే వెరిఫికేషన్ చేసుకొని తదుపరి జరిగే కౌన్సిలింగ్‌కు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలియ జేశారు.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి : ఎంపీడీఓ

సంబేపల్లె, మే 10: ఎన్నికల నిర్వహణలో పంచాయతీ సెక్రటరీలు అప్రమత్తంగా ఉండాలి ఎంపీడీవో నిర్మలాదేవి తెలియజేశారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సమస్యలను ఎప్పటికప్పుడు చేరవేయాలని తెలియజేశారు. ఓటర్లు శాంతియుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పై అధికారులకు ఎప్పటికప్పుడు సమాచారాన్ని అందించాలన్నారు. ఎన్నికల సిబ్బందికి వసతులను పరిశీలించాల్సిన బాధ్యత ఉందన్నారు. భోజనాలు, మరుగుదొడ్లు, విద్యుత్ వంటి సమస్యలు లేకుండా చూడాలని తెలిపారు. కార్యక్ర మంలో ఈవోపీ ఆర్‌డీ రవీంద్ర, పంచా యతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

మండల పూజలు

గాలివీడు, మే 10: మండల కేంద్రంలోని పెద్దూరు బ్రాహ్మణవీధి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మండల పూజలు నిర్వహించారు. మార్చి 19, 20వ తేదీల్లో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ అనంతరం 48 రోజుల పాటు భక్తిశ్రద్ధల మధ్య స్వామి వారిని ఆరాధించారు.

కరెంట్ షాక్‌తో పశువులు మృతి

కాశినాయన, మే 10: వడ్డమాను గ్రామంలో గురువారం వ్యవసాయ పొలాల వద్ద విద్యుత్ తీగలు తగిలి కావూరి గురయ్య అనే రైతుకు చెందిన రెండు పశువులు మృతి చెందినట్లు పశువైద్యాధికారి డాక్టర్ రామారావు తెలిపారు. గ్రామస్తులు, బాధితుల వివరాల మేరకు.. నాలుగు రోజుల క్రితం వీచిన గాలివానకు గ్రామ సమీపంలో విత్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కింద పడింది. మేతకు పోయిన పశువులు కరెంట్ షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయాయి. దాదాపు రూ.1.50 లక్షల విలువైన పశువులు చనిపోయాయని బాధిత రైతు వాపోయాడు. 4 రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ పడిపోతే విషయం తెలిసి కూడా కరెంట్ సరఫరాను నిలుపుదల చేయకపోవడం దారుణమని, సిబ్బంది నిర్లక్ష్యంతోనే పశువులు చనిపోయాయని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



కరెంట్ షాక్‌తో చనిపోయిన పశువులు